రైలులో ప్రసవం

- మగబిడ్డకు జన్మనిచ్చిన జార్ఖండ్ మహిళ

-వార్త 8వ పేజీలో



తల్లీబిడ్డను రైలు నుంచి దించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

వర్షాలతో రైతుల్లో గుబులు

- 'నాతవరం'లో అత్యధికంగా 64.8 మి.మీ. నమోదు
- రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారం
- తుఫాన్ వరద ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న వరి
- ఇప్పుడు వర్షాలు కురిస్తే నష్టపోతామని అన్నదాతలు ఆందోళన

జిల్లాలో 13 మి.మీ. సగటు వర్షపాతం



సబ్బవరంలో వెన్ను దశలో వరి పైరు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అల్పపీడనం కారణంగా బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమగాలుల ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ సమాచారంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం 'మొంథా' తుఫాన్ సంభవించి భారీ వర్షాలు పడడంతో సుమారు మూడున్నర వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. ముంపు ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే వరిపైరు తేరుకుంటున్నది. మళ్లీ ఇంతలోనే వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లాలో సగటున 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాతవరం మండలంలో అత్యధికంగా 64.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బుచ్చెయ్యపేటలో 52.2, పాయకరావుపేటలో 31.8, చోడవరంలో 28.4, కశింకోటలో 28.4, అనకాపల్లిలో 26.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చీడికాడ, సబ్బవరం, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. మంగళవారం ... మిగతా 8వ పేజీలో

వరికి చీడపీడలు

వాతావరణ మార్పులతో పొంచిఉన్న తెగుళ్ల బెడద

- సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలి
- ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు సూచన



వరి పైరుకు తెగుళ్ల నివారణ మందును పిచికారీ చేస్తున్న రైతు

అనకాపల్లి అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపైరును పలు రకాల తెగుళ్లు ఆశించే అవకాశం వుందని స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. మంగళవారం ఇక్కడ జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆకుమడత, కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇంకా గోధుమ రంగు మచ్చ, పొడతెగులు, పొట్టకుళ్ల తెగులు, మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని చెప్పారు. వీటిని అదుపు చేయడానికి ఒక లీటరు నీటికి కార్బండిజం ఒక గ్రాము లేదా హెక్సాకోనజోల్ 2 మిల్లీమీటర్లు లేదా ప్రొపికోనజోల్ ఒక మిల్లీ మీటరు లీటరు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. సుడిదోమ ఆశిస్తే అసిఫేట్ మందును లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని, దోమ ఉధృతి ఎక్కువగా వుంటే లీటరు నీటికి పైమెట్రోజోన్ 0.6 గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు.

చెరకు తోటలను వలయాకారపు మచ్చ తెగులు ఆశించే అవకాశం వుందని, దీని నివారణకు లీటరు నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా మాంకోజెబ్ మూడు గ్రాములు ... మిగతా 8వ పేజీలో



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, కూటమి నేతలు

ఘనంగా ఐక్యతా యాత్ర

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం అనకాపల్లిలో 'ఐక్యతా యాత్ర' నిర్వహించారు. శారదా నది బ్రిడ్జి వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగా సుంకరమెట్ట జంక్షన్ వరకు సాగింది. ఎంపీ రమేశ్, కలెక్టర్, ఎస్పీ, కూటమి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

-వార్త 8వ పేజీలో

వ్యవసాయ కూలీల వలస

గోదావరి జిల్లాల్లో వరి కోత పనులకు పయనం

- స్థానికంగా పొలం పనులు లేకపోవడమే కారణమంటున్న కూలీలు
- ఇక్కడ వరికోతల నాటికి తిరిగొస్తామని వెల్లడి



ఆటోలో సామాన్లు సర్దుకుని గోదావరి జిల్లాలకు పయనమవుతున్న మేడివాడ వ్యవసాయ కూలీలు

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి కోతలు మొదలవుతుండడంతో ఏటా మాదిరిగానే మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు వలసబాటపట్టారు. స్థానికంగా ఉపాధి హామీ పథకం పనులకు విరామం ఇవ్వడం, వరి కోతలు ఈ నెలాఖరులోగా మొదలయ్యే అవకాశం లేకపోవడంతో వంట సామగ్రి, దినుసులు, దుస్తులతో ఇక్కడి నుంచి వెళుతున్నారు. మేడివాడ, మట్టవానిపాలెం, టి.అర్జాపురం, చిలకవానిపాలెం తదితర గ్రామాల నుంచి రెండు రోజులుగా పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లలో అమలాపురం, మండపేట, సామర్లకోట, అనపర్తి, నిడదవోలు, తణుకు, ఉండి తదితర ప్రాంతాలకు బయలుదేరి వెళుతున్నారు. వరి కోతలతో పాటు ... మిగతా 8వ పేజీలో

ఇక్కడ పనుల్లేవ్.. అందుకే వెళుతున్నాం



శానాపతి హనుమంతు, వ్యవసాయ కూలీ, మేడివాడ

వర్షాల కారణంగా ఉపాధి హామీ పథకం పనులు మరో నెల రోజుల వరకు చేపట్టలేమని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ వరి కోతలు వచ్చే నెలలో మొదలయ్యే అవకాశం వుంది. పొలాల్లో మరేఇతర పనులు లేవు. ఖాళీగా వుండడం ఎందుకని గోదావరి జిల్లాల్లో వరి కోతల పనులకు వెళుతున్నాం. భార్యాభర్తలు నెల రోజులపాటు వరి కోతలకు వెళితే తిండి ఖర్చులు పోను రూ.30 వేలు మిగులుతాయి. 15-20 మంది జట్టుగా బయలుదేరి వెళుతున్నాం. అక్కడ వరి కోతలు పూర్తయ్యేసరికి ఇక్కడ మొదలవుతాయి. అప్పటికి తిరిగి వచ్చేస్తాం.



గొల్లవిల్లి కోటి, వ్యవసాయ కూలీ, మట్టవానిపాలెం

నేడు మంత్రి గొట్టిపాటి జిల్లా పర్యటన

- చౌడువాడ, కింతలిలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్న రవికుమార్



మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్న కింతలి విద్యుత్ సబ్‌స్టేషన్

అనకాపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరవుతారు. 10 గంటలకు ఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం 10.45 గంటలకు కె.కోటపాడు మండలం చౌడువాడ చేరుకుని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.15 గంటలకు మాడుగుల మండలం కింతలిలో సబ్‌స్టేషన్‌ను ... మిగతా 8వ పేజీలో

ఏయూలో ఎందుకిలా!?

విద్యార్థుల వరుస ఆందోళనలు

- వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనలు
- గత ప్రభుత్వ హయాంలో సమస్యలున్నా మౌనం
- కార్యాలయం ఎదుట ఇనుప గ్రిల్స్ ఏర్పాటుచేసినా ప్రశ్నించేందుకు సాహసించని వైనం
- తాజాగా రోడ్డెక్కి మరీ బైఠాయింపు
- శతాబ్ది ఉత్సవాల వేళ వర్సిటీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై సీనియర్ ప్రొఫెసర్ల ఆందోళన



క్యాంపస్‌లో సమస్యలపై వైస్‌ఛాన్సలర్ రాజశేఖర్‌ను ఆయన చాంబర్‌లో ప్రశ్నిస్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఏదో ఒక సమస్యపై తరచూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని బైఠాయిస్తున్నారు. గతంలో ఉన్నతాధికారులను ప్రశ్నించడానికి, అసలు సమస్యను చెప్పుకోవడానికి కూడా ముందుకురాని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు...ఇప్పుడు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్సిటీలో పాలకులు మారారు. తొలుత ప్రొఫెసర్ జి.శశిభూషణ్ ఇన్‌చార్జి వీసీగా నియమితులు కాగా, ఆ తరువాత పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో శశిభూషణ్, ఇప్పుడు రాజశేఖర్ హయాంలో అనేకమార్లు విద్యార్థులు ఆందోళనలు నిర్వహించారు. అదే ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. వైసీపీ హయాంలో విద్యార్థి సంఘాలు గానీ, విద్యార్థులుగానీ తమ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలుండేది కాదు. ఇప్పుడు అందుకు అవకాశం ఉన్నప్పటికీ అనేక సందర్భాల్లో విద్యార్థులు ఆందోళనబాట పట్టడం వెనుక కారణాలేమిటో అంతుబట్టడం లేదు. ముఖ్యంగా శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ విద్యార్థులు తరచూ ఆందోళనలకు దిగడం వర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చుతుందని సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు. విద్యార్థుల ఆందోళనలను వెనకుండి ఎవరో నడిపిస్తున్నారనే అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై వర్సిటీలోనూ చర్చ జరుగుతోంది.

అరడజనుసార్లు ఆందోళనలు

పాలకులు మారిన తరువాత వివిధ కారణాలతో అరడజను సార్లకుపైగా విద్యార్థులు ఆందోళనలు చేశారు. తొలిసారి గత ఏడాది ఆగస్టులో భోజనం సరిగా లేదంటూ వివిధ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు వీసీ కార్యాలయం వద్ద ... మిగతా 8వ పేజీలో

టెన్త్, ఇంటర్‌లో శతశాతం

ఉత్తీర్ణత సాధించాలి

గురుకులాలు, ఆశ్రమాలు, వసతిగృహాల విద్యార్థులపై దృష్టి

- సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి
- బాలికల హాస్టళ్లలోకి అన్యులను అనుమతించొద్దు
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖలు, కేజీబీవీ, విద్యా శాఖ అధికారులు, వసతిగృహాల సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలు, పరీక్షల ముందస్తు ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. చదవటం, రాయటంపై నిత్యం తర్ఫీదు చేయాలని, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులు.. స్కూళ్లు తెరిచిన రోజే తిరిగి వచ్చేలా ... మిగతా 8వ పేజీలో

తాండవకు పెరిగిన ఇన్‌ఫ్లో

1,430 క్యూసెక్కులతో 379 అడుగులకు చేరిన నీటిమట్టం

- స్పిల్‌వే నుంచి 1,237 క్యూసెక్కులు, ఆయకట్టుకు 620 క్యూసెక్కులు విడుదల



స్పిల్‌వే గేట్ల నుంచి తాండవ నదిలోకి విడుదల అవుతున్న నీరు

నాతవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

తాండవ రిజర్వాయర్‌లోకి మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా సోమవారం రాత్రి ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో మంగళవారం 1,430 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. దీంతో నీటిమట్టం 379 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ముందు జాగ్రత్త చర్యగా స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 1,237 క్యూసెక్కుల నీటిని తాండవ నదిలోకి విడిచిపెడుతున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ చెప్పారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆమె కోరారు. కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు 620 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కల్యాణపులోవ నుంచి 250 క్యూసెక్కులు..

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులుకాగా మంగళవారం 150 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతున్నది. దీంతో నీటిమట్టం 458 అడుగులకు మించకుండా చూస్తే స్పిల్‌వే గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడుదల చేస్తున్నారు.

జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు

ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగులకు అవకాశం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ
- 'ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ ఆఫ్ ఏపీ'తో టైఅప్
- ఔత్సాహికులకు జర్మనీ భాషతోపాటు వృత్తి నైపుణ్యంపై శిక్షణ
- జర్మనీలో డిప్లొమా ఉద్యోగికి 3 వేల యూరోలు
- భారతీయ కరెన్సీలో రూ.3 లక్షలతో సమానం
- ఐటీఐ అభ్యర్థులకు 2,700 యూరోలు
- దరఖాస్తులకు 10వ తేదీ వరకే గడువు

నర్సీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ యువతకు జర్మనీలో ఎలక్ట్రికల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ తోడ్పాటు అందిస్తున్నది. ఎలక్ట్రికల్ విభాగంలో ఐటీఐ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసి, మూడు నుంచి ఐదేళ్ల వరకు వృత్తి అనుభవం వున్న నిరుద్యోగ యువకుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. నవంబరు 10వ తేదీ వరకే గడువు వుంది. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో దళారుల చేతుల్లో మోసపోకుండా వుండేందుకు 'ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ ఆఫ్ ఏపీ'తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ టైఅప్ పెట్టుకున్నది.



ఎలక్ట్రికల్ పని చేస్తున్న విద్యార్థి

పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి రాజమహేంద్రవరంలో ఎనిమిది నుంచి పది వారాలపాటు జర్మనీ భాష, వృత్తి పరమైన శిక్షణ ఇస్తారు. ఇందుకు రూ.50 వేలు ట్రైనింగ్ ఫీజు (ఈఎంఐ సదుపాయం ఉంది), రూ.10 వేలు రిజిస్ట్రేషన్ ఫీజును ... మిగతా 8వ పేజీలో

వైద్య శిబిరంలో 105 పశువులకు పరీక్షలు



పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీడీ చంద్రశేఖర్, ఏడీ గంగాధర్

ఎలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్క వరంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 105 పశువులకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 39 పశువులకు గర్భకోశ పరీక్షలు, 66 పెయ్యలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధర్, పశువైద్యాధికారులు ఎల్. కన్నయ్యనాయుడు, ఎస్.సౌజన్య, మొబైల్ వెటర్నరీ డాక్టర్. బి.హారిప్రియ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

7న హాకీ ఫెడరేషన్ శత వసంత కార్యక్రమాలు

ఎలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత హాకీ ఫెడరేషన్ ఏర్పడి ఈనెల 7వ తేదీకి శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎలమంచిలిలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అసోసియేషన్ జిల్లా కన్వీనరు కొఠారు నరేష్ తెలిపారు. హాకీ ఏపీ సంఘం ఆదేశాలతో ఈనెల 7వ తేదీన బాల,బాలికల హాకీ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ క్రీడాకారులను సత్కరిస్తామని, క్రీడాభిమానులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఎలమంచిలి కళాశాల మైదానంలో హాకీ శత వసంత ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటామన్నారు.

ఆశ వర్కర్ల మహాసభలను విజయవంతం చేయాలి

అచ్యుతాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యలపై ఈనెల ఎనిమిది నుంచి రెండు రోజుల పాటు అనకాపల్లిలో జరిగే ఐదో మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు కోరారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నప్పటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధర్మిరెడ్డి సరోజిని, ఎస్. సూర్యలక్ష్మి, ఎం. దేవుడమ్మ, పడమ్మ, పల్లవి, వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం : ఎంపీడీవో

అచ్యుతాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఎంపీడీఓ చిన్నారావు తెలిపారు. మంగళవారం అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మోసయ్యపేటలో కాలువల్లో పూడిక కారణంగా మురుగు నీరు ప్రవహించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో పూడిక తీశామని, ప్రస్తుతం వాహనాలు వెళ్లలేని ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో కాలువల్లో పూడిక తీయిస్తున్నామన్నారు. అలాగే అచ్యుతాపురం, ఇందిరమ్మ కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను వాహనాలు సహాయంతో తరలిస్తున్నామన్నారు. పంచాయతీల్లో క్లోరినేషన్ కార్యక్రమాన్ని కూడా చేస్తున్నామన్నారు. ముఖ్యంగా అవసరమైన చోట్ల బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు.

చెకుముకి పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అచ్యుతాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండల స్థాయి పరీక్షలు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 12 మందిని జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్టు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. పద్మావతి, జేవీవీ ప్రతినిధులు మారిశెట్టి వెంకట అప్పారావు, ఉప్పాడ రాము, బొడ్డే రామ్‌కుమార్, సుధ, కళికళ, మారిశెట్టి కృష్ణకుమారి, ఆళ్ల రూప పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు కుమారస్వామి

ఎలమంచిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీజేపీ ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ జిల్లా కో-కన్వీనర్ వుడా రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. మంగళవారం ఏటికొప్పాక గ్రామంలో జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా హర్ ఘర్ స్వదేశీ వస్తువుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింట కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి సత్యనారాయణ, మండల కార్యదర్శి దారా నూకరాజు, ఎన్. శ్రీను, కె.అప్పలరాజు పాల్గొన్నారు.

మత్స్యకారులకు గుడ్డ సంచుల పంపిణీ



గుడ్డ సంచులను చూపిస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను జయప్రదం చేయాలని యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్ ఫెసిలిటేటర్ ఐ కృష్ణకుమారి అన్నారు. మంగళవారం కొండకర్ల ఆవలో మత్స్యకారులకు వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ సంచులు వద్దని, వస్త్ర సంచులనే వాడాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ల్యాండ్ ఫిషర్‌మెన్ ఫోరం అధ్యక్షుడు ఎం. రమణ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీఓ వ్యవస్థాపకులు జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో ఎక్కడి చెత్త అక్కడే..!

- పది రోజులుగా చెత్త సేకరణ చేయని పారిశుధ్య కార్మికులు
- అధ్వానంగా తయారైన పారిశుధ్యం
- స్వైరవిహారం చేస్తున్న దోమలు



రాట్నాలపాలెంలో రోడ్డు పక్కనే ఉన్న చెత్తచెదారం

కోటవురట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మేజర్ పంచాయతీలో పది రోజుల నుంచి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించలేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఫలితంగా పారిశుధ్యంగా అధ్వానంగా తయారైంది. చెత్త నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలనుంచి కోటవురట్ల మెయిన్ రోడ్డు, ఆస్పత్రి, వసతి గృహాలు ఇళ్ల నుంచి చెత్త సేకరణ చేయడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇళ్లలో చెత్త బుట్టలు నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు యజమానులు ఈ చెత్తను తీసుకు వచ్చి రోడ్డు పక్కన పడేస్తుండగా.. మరికొందరు కాల్చివేస్తున్నారు. బీసీ కాలనీ, యాతపేట, గొల్లపేట, రాట్నాపాలెంల్లో పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెనేజిల్లో చెత్తచెదారం కొట్టుకుపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. పంచాయతీలో సంపద కేంద్రం ఏర్పాటు చేయలేదు. గ్రామంలో రోజు విడిచి రోజు చెత్త సేకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బాంబు బ్లాస్టింగ్ ప్రాంతంలో ఇంటింటా సర్వే



దుర్గానగర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ఆనుకుని జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్ ప్రభావిత ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ గత కొంతకాలంగా కొండను పగులగొట్టేందుకు బాంబు బ్లాస్టింగ్ పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ కారణంగా సమీపంలో ఉన్న దుర్గానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్లు బీటలు వారి నష్టపోతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై బాధితులు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహశీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం పట్టణంలో ఇంటింటి సర్వే చేపట్టారు. మంగళవారం దుర్గానగర్‌లో ఇంటింటికి తిరిగి బాంబు బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు ఏ మేరకు దెబ్బతిన్నాయన్న దానిపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటకు సస్యరక్షణతో మంచి ఫలితాలు : ఏవో



నామవరంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ పి.ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సమగ్ర సస్యరక్షణతో మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండలంలో నామవరం, పీఎల్.పురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన వరి పంటను పరిశీలించి, రైతులకు సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ పంట కాలంలో 32 కేజీల నత్రజని, 24 కేజీల భాస్వరం, 20 కేజీల పొటాష్ వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వరిలో సుడిదోమ నివారణపై అవగాహన



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లిపాడు, దోసలపాడు గ్రామాల్లో వరి పొలాలను ఏవో ఉమాప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అక్కడక్కడా కొన్నిచోట్ల వరిలో సుడిదోమ సోకినట్టు గుర్తించారు. సుడిదోమ నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించారు. మందు కొట్టేటప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులు వాడాలని, పొలంలో అక్కడక్కడా దీపపు కాంతి ఎరలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ క్షేత్ర పర్యటనలో ఏఈవో సత్యనారాయణ, శ్రీనివాస్, ఆర్ఎస్‌కే సిబ్బంది లావణ్య, శిరీషా, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనం



గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేస్తున్న భక్తులు

రాంబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబోలు గ్రామంలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను కోయ డాన్సులు, నేల వేషాలతో, సంప్రదాయ నృత్యాలతో ఊరేగించారు. గత నెల 12న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉత్సవ విగ్రహాలు ఊరేగించారు. సోమవారం నిమజ్జనంతో ఉత్సవాలు ముగిశాయి.

ట్రిపుల్ జంప్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పి.నాగమౌనిక, జె తారకలక్ష్మి

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి నాగమౌనిక, జెతారకలక్ష్మి ట్రిపుల్ జంప్ పోటీల్లో సత్తా చాటారు. సోమవారం విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి ట్రిపుల్ జంప్ పోటీల్లో బాలికల విభాగంలో ఈ విద్యార్థినులిద్దరూ చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం జాన్ మెతు షెలా, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, లోవరాజు మంగళవారం తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో నాగమౌనిక, తారకలక్ష్మి పాల్గొంటారని చెప్పారు.

శ్రీప్రకాష్‌లో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం



యూకేజీ విద్యార్థులకు పట్టాలు అందజేసిన దృశ్యం

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో మంగళవారం యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరం యూకేజీ పూర్తిచేసిన విద్యార్థులకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జిలు బి.ప్రసూనమౌళి, ఉషారాణి, భార్గవి, సునీత, డీఎల్‌పీ.రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శత వర్ష జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించి వ్యాసరచన, వక్తృత్వ, ఇతర పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్‌లో విజేతలకు సత్యసాయి భజన మండలి జోన్ ఇన్‌చార్జి విశ్వేశ్వరరావు, ప్రతినిధులు కక్కిరాల సురేశ్, కొత్త భగవాన్, హెచ్‌ఎం జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, కుమారి, పద్మావతి తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు



మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని 19 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా లింగరాజుపాలెం ఎంజేపీ, పెద్దఉప్పలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు శ్రీఆదర్శ హైస్కూలు, వినయ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికైనట్టు చెకుముకి పోటీల జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగడం వరప్రసాద్ తెలిపారు. అంతకముందు మండలస్థాయి చెకుముకి పోటీల ప్రశ్నపత్రాన్ని కొరుప్రోలు పాఠశాల హెచ్‌ఎం కప్పల ప్రసాద్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చోడవరంలో మెగా జాబ్‌మేళా

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. అనేక కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్‌మేళాలో ఐటీఐ నుంచి ఇంటర్, డిగ్రీ ఇతర విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావాలని కోరారు.

పునరావాస కాలనీ పనుల పరిశీలన



పునరావాస కాలనీ వద్ద టీడీపీ నాయకులు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిడార్ నిర్వాసిత రైతులకు బోదిగల్లం వద్ద ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీ పనులను మంగళవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు తదితరులు లేఅవుట్లు, పునరావాస కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. డ్రైన్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు వంటి పనులు త్వరగా పూర్తిచేయాలని హోం మంత్రి అనిత ఇప్పటికే అధికారులను ఆదేశించినట్టు వెంకటేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బోదిగల్లం, అమలాపురం సర్పంచ్‌లు షేక్ మున్నీషాబేగం, పెదపూడి శంకరరావు, గంటా నర్సింగరావు, సూరకాసుల గోవింద్, ఎరుపల్లి అప్పలరాజు, పుణ్యమంతుల బాబ్జీ, రోకళ్ల గోవింద్ పాల్గొన్నారు.

నక్కపల్లి ఎంపీడీవోగా చైతన్య



చైతన్య

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఎంపీడీవోగా బి.చైతన్య నియమితులయ్యారు. సబ్బవరంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమెను పదోన్నతిపై నక్కపల్లి ఎంపీడీవోగా నియమించారు. ఆమె మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో డీ సీతారామరాజు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన సీతారామరాజు ఏవోగా కొనసాగుతారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన చైతన్యను పలువురు సెక్రటరీలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ముంపు పొలాలను నమోదు చేయండి

- తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వరహానర్సింగరావు



వాడ్రాపల్లిలో కుళ్లిన వరి పంటను వ్యవసాయ అధికారులకు చూపిస్తున్న నర్సింగరావు, తదితరులు

మునగపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా నీటి ముంపునకు గురైన పొలాలను గుర్తించి నమోదు చేయాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు పేర్కొన్నారు. మంగళవారం వాడ్రాపల్లిలో పర్యటించిన మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారికి వారానికిపైగా నీటి ముంపులో ఉన్న పొలాలను ఆయన చూపించారు. ముంపు తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని రైతులు మళ్ల జోగినాయుడు, మద్దాల నర్సింగరావు, కొయిలాడ సోమేశ్, లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

కార్తీక మాసంలో నిత్యాన్నదానం మంచి ఆలోచన

- తహశీల్దార్ పి.సత్యనారాయణ



వెంకటాపురంలో శివలింగాన్ని దర్శించుకున్న తహశీల్దార్ సత్యనారాయణ

మునగపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో నిత్యాన్నదానం మంచి ఆలోచన అని తహశీల్దార్ పి.సత్యనారాయణ అన్నారు. మండలంలో వెంకటాపురం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వయంభూ శివలింగాన్ని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. కార్తీక మాసం ప్రారంభరోజు మొదలుకొని మధ్యలో తుఫాన్‌లు ఎదురైనా భక్తులకు భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీసర్పంచ్ సుందరపు వెంకట కనకఅప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు, బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, బుద్ధరాజు మాధవవర్మ, రక్కుల శ్రీనివాసరావు, సుందరపు కాసులుబాబు తదితరులు పాల్గొన్నారు.

తోటాడ మద్యం దుకాణంలో చోరీ

మునగపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడ మద్యం దుకాణంలో చోరీ జరిగినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు మూసిఉన్న మాణిక్యందేవి బ్రాంది షాపును తెరచి ఆరు బీర్లు, రూ.3వేలు నగదును అపహరించారన్నారు. నిర్వాహకులు ఫిర్యాదు మేరకు క్లూస్ టీమ్ తనిఖీలు నిర్వహించిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గుడివాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మీనాకుమారి

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలందరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. మంగళవారం గుడివాడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 2026-27 సంవత్సరానికి రూ. 26 కోట్లతో లేబర్ బడ్జెట్‌కు ప్లానింగ్ గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, టీడీపీ మండల మాజీఅధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో నక్కపల్లి హైస్కూల్‌కు చెందిన టెన్త్ బాలిక రేణుకాదేవి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగ శివరామ్, మణి పాల్గొన్నారు.


స్పీకర్ అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న నూకాంబిక పాలకవర్గం ప్రతినిధులు

శాసన సభాపతికి సత్కారం

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంకు వచ్చిన శాసన సభాపతి సిహెచ్.అయ్యన్నపాత్రుడును నూకాంబిక ఆలయ నూతన పాలకవర్గం ప్రతినిధులు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ పీలా నాగశ్రీను అయ్యన్నపాత్రుడుకు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భోజనం అదిరింది..

- అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- భోజనం రుచికరంగా ఉందని కితాబు


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో ఆయిషా

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో భోజనం బాగుతుందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను మంగళవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి భోజనం సమయంలో అన్న క్యాంటీన్‌కు వచ్చి భోజనానికి క్యూలైన్ సిద్ధమైన వారితో మాట్లాడారు. భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు ఆర్డీవో షేక్ ఆయిషా తోటి భోజన ప్రియులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉందని కలెక్టర్ కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ


మరిడిమాంబ జాతర పోస్టర్‌ను కమిటీ సభ్యులతో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో గురువారం నిర్వహించనున్న మరిడిమాంబ జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మంగళవారం ఆవిష్కరించారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జాతరకు పరవాడ, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల వెంకునాయుడు, పైలా రథాల సన్యాసిరావు, వెన్నెల సన్యాసిరావు, పైలా అప్పలనాయుడు, వెన్నెల నరసింహరావు, పైలా ప్రసాద్, లోకిరెడ్డి అబి నాయుడు, బోజంకి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవాన్ని తిలకించిన డీఎస్పీ శ్రావణి


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న డీఎస్పీ

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి పుస్తక మహోత్సవ ప్రదర్శనను మంగళవారం సాయంత్రం డీఎస్పీ ఎం.శ్రావణి తిలకించారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించి విలువైన రచనలు ప్రదర్శనలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రేమ్‌కుమార్, వెంకట నారాయణ, అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసకపల్లి-లంకెలపాలెం రోడ్డుకు మోక్షం

- ఆర్అండ్‌బీ సీఈ విజయశ్రీ పరిశీలన
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


రోడ్డును పరిశీలించి స్థానిక ప్రజలతో ఆర్అండ్‌బీ సీఈ విజయశ్రీ, అధికారులు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. 'గజానికో గండం' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పైడివాడఅగ్రహారం గ్రామ సమీపంలో ఏర్పడ్డ భారీ గోతులను రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ, అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అసకపల్లి నుంచి లంకెలపాలెం వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర రోడ్డులో ఏడేళ్లుగా భారీ గోతులు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 17 కిలోమీటర్ల మరమ్మతులు చేపట్టడం జరిగిందని, మిగతా ఐదు కిలోమీటర్లు పాక్షికంగా మరమ్మతులు చేపట్టి వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ధ్వంసమైందని, దీంతో వాహన చోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నారని ఎంపీటీసీ మంజా సభ్యులు అక్కిరెడ్డి లక్ష్మీ, దుర్గినాయుడు సీఈకి వివరించారు.

అనంతరం సీఈ విజయశ్రీ మాట్లాడుతూ ఈ రోడ్డు బాగు చేసేందుకు పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపించి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ రోడ్డును బాగు చేయాలని ఇప్పటికే ప్రభుత్వంతో మాట్లాడారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ సాంబశివరావు, డీఈ విద్యాసాగర్, జేఈ బాలరాజు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యులు శీరం అప్పలరాజు, నాయకులు అచ్చిబాబు, కోన సత్యనారాయణ, శివరాం, మహేశ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించే శిశు సంరక్షణ కేంద్రాలకే అనుమతులు

ఏడు సంస్థలకు నోటీసుల జారీ : కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్న శిశు సంరక్షణ కేంద్రాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు మంజూరుకు కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న సంస్థలు 43 ఉండగా, వాటిలో మూడు ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ సంస్థల కోసం జిల్లా బాలల సంరక్షణ ఆధ్వర్యంలో జీవో నంబరు-9 ప్రకారం జిల్లా స్థాయి పరిశీలన బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ జిల్లాలోని 43 సంస్థలను పర్యవేక్షించి, వాటి స్థితిగతులను పరిశీలిస్తాయని చెప్పారు. కమిటీ రిపోర్టు ఆధారంగా 35 సంస్థలకు నేరుగా రిజిస్ట్రేషన్ కోసం అవకాశం కల్పించినట్టు చెప్పారు నిబంధనలు ప్రకారం మౌలిక సదుపాయాలు లేని ఏడు సంస్థలను నోటీసులు జారీ చేయాలని, అందులో ఆశ్రయం పొందుతున్న చిన్నారులను దగ్గరలో గల ఇతర సంస్థలలో ఆశ్రయం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని శిశు గృహ సంరక్షణ కేంద్రం సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, నిరాశ్రయ పిల్లలను గుర్తించి అందులో ఆశ్రయం కల్పించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాలలో చిన్నారులు ఏ పాఠశాలలో చదువుతున్నారనే వివరాలు సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. నిబంధనలు అమలు జరిగేలా చూడాలని, అన్ని నిబంధనలు సరిగా పాటించిన తరువాతే అనుమతులకు సిఫారసు చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా


సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. తుమ్మపాల, బవులవాడ, తగరంపూడి, మెట్టపాలెం గ్రామాల్లో సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతున్నదన్నారు. ప్రతీ ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారన్నారు. పేదలను అన్ని అంశాల్లో ఆదుకోవడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 12 మందికి మంజూరైన రూ.11 లక్షల 38 వేలు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు ఆడారి గోవిందరావు, పీలా బుజ్జి, వియ్యపు సింహాచలం, గొర్లి శ్రీనివాసరావు, రాపేటి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేయించుకోండి

- జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి


సచివాలయంలో తనిఖీలు చేస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సూచించారు. పట్టణంలో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆధార్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, రుసుములను తెలుసుకున్నారు. అనంతరం జడ్సీ మాట్లాడుతూ ఐదు నుంచి 15 ఏళ్ల వారికి ఉచితంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు. అలాగే నెయ్యిలవీధిలోని కాలువను పరిశీలించారు. ఎప్పటికప్పుడు కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కౌశల్యం సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని, ఈ సర్వే ద్వారా అర్హత ఉన్న ప్రజలకు ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని జడ్సీ చెప్పారు. జోన్ పరిధిలోని 27 సచివాలయాల్లో కౌశల్యం పరీక్షలు కూడా ఈ వారంలోనే జరుగుతాయని, ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వం వర్క్ ఫ్రం హోమ్ అవకాశాలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాన ఆలయాల కమిటీలతో అధికారుల సమావేశం


సోమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన ఆలయాలకు సంబంధించిన కమిటీలతో మంగళవారం అధికారులు సమావేశాలు నిర్వహించారు. లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి, పెదయాతపాలెం గౌరీ పరమేశ్వరస్వామి ఆలయాలను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సీఐ జి.రామచంద్రరావు తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల సభ్యులతో వారు మాట్లాడుతూ కార్తీక మాసం, కార్తీక పౌర్ణమి నేపథ్యంలో ఆలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, పక్కాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే సమన్వయ కమిటీలు నియమించాలని వారు చెప్పారు. ఎక్కడికక్కడ బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. తోపులాటలు లేకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని వారు తెలిపారు. భక్తులు క్రమశిక్షణగా దైవ దర్శనాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డీఆర్వీ సత్యనారాయణ, సర్పంచ్ దాడి లావణ్య, కన్నంనాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాపేటి అరుణ, రాము, శరగడం శంకరరావు, రామునాయుడు, అర్చకులు డి.శేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని విరమించుకోవాలి

- వైసీపీ కోటి సంతకాల సేకరణలో అమర్‌నాథ్


శిబిరంలో సంతకాలు చేస్తున్న అమర్‌నాథ్, నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో మార్చడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కోరారు. నెహ్రూచౌక్‌లో మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ఈ కళాశాలలను ఏర్పాటు చేస్తే, ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం సరికాదన్నారు. ఈ విధానాన్ని విరమించకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నాయకులు బొడ్డేడ ప్రసాద్, బీపీ సత్యవతి, ఎం.జానకిరామరాజు, దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను నిర్వహణలోకి తేవాలి

- జిల్లా పంచాయతీ అధికారి సందీప్


కశింకోటలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సందీప్

కశింకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ సూచించారు. కశింకోటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు చెత్తచెదారాన్ని తరలించాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల్లోఅభివృద్ధి పనులకు వినియోగించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. మంగళవారం రాత్రి సిబ్బందితో కలిసి ఆయన లంకెలపాలెం, పరవాడ సినిమాహాల్ జంక్షన్ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న, పరిమితికి మించి అధికలోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్లకు జరిమానాలు విధించారు. అలాగే విస్తృతంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ భద్రత కోసం ప్రజలందరూ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎంవీఐ గోపీకృష్ణ, ఎస్ఐలు మహాలక్ష్మి, కృష్ణారావు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిలో వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రికార్డులు లేకపోతే చర్యలు తప్పవు

- అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, డీటీసీ డీఎస్పీ మోహనరావు


కొత్తూరు కాలేజీ కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీలు

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రికార్డులు లేని వాహన చోదకులపై చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, జిల్లా ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ మోహనరావు హెచ్చరించారు. కొత్తూరు పంచాయతీలోని కాలేజీ కూడలిలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణను కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, నిర్దేశించిన వేగంతోనే ప్రయాణించాలని సూచించారు. తగిన నిబంధనలు పాటించి తోటి ప్రయాణికులు సురక్షిత ప్రయాణం చేసేలా నడుచుకోవాలన్నారు. అతి వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పూడిమడక వెళ్లే జంక్షన్‌లోని జాతీయ రహదారిపై పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో తుప్పలు తొలగించరూ..

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానవాటిక ప్రాంగణంలో పెరిగిపోయిన తుప్పలు, ముళ్ల పొదలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. నెలల తరబడి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఆ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. దీనికితోడు చికెన్ వ్యర్థాలను సంబంధిత షాపుల యజమానులు శ్మశానవాటిక పరిసర ప్రాంతాల్లో పడవేయడంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. శ్మశానవాటికను పరిశుభ్రంగా తయారు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముళ్ల పొదల కారణంగా అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి శ్మశానవాటికలో ముళ్ల పొదలు తొలగించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా తయారు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు ఉన్నత పాఠశాలకు బాటజంగాపాలెం సర్పంచ్ పడాల వెంకటరమణ మంగళవారం రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం టి.పద్మ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సేనాపతి రాము దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ వనం లక్ష్మీ, పందిరిపల్లి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు మంగళవారం కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని మలునాయుడుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచులు బండారు మంగ, బోను దేముడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి కనకరాజు, పార్టీ నాకులు గండి రవికుమార్, కొటాన రాము, కర్రి బాబు, యడ్ల నాయుడు, బండారు శ్రీను, ఐడి బాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పీఆర్‌టీయూ కార్యదర్శి పెద్దినాయుడు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.పెద్దినాయుడు డిమాండ్ చేశారు. సబ్బవరంలో మంగళవారం పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంగినారపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు ఇవ్వాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొబ్బిలి అప్పలరాజు, రాష్ట్ర కార్యదర్శి సత్యంనాయుడు, మండల బాధ్యులు అప్పలనాయుడు, వనం భాస్కరరావు, ఆనంద్, కె.కృష్ణ, అప్పారావు, అశోక్‌కుమార్, గోవింద పాల్గొన్నారు.

మహిళకు గాయాలు


కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన చిన్ని నాగమణి వంట గదిలో నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పివేసి నాగమణిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతుందన్నట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా మత్తు పదార్థాల వినియోగం జోలికి వెళ్లకూడదని పరవాడ ఎస్ఐ మహాలక్ష్మి సూచించారు. మండలంలోని తానాం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. సముద్ర తీరాలు, నీటి ప్రదేశాలు, చెరువుల వద్దకు వెళ్లకూడదన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గణేశ్, బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ పీఎల్ నారాయణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీలు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో నక్కపల్లి హైస్కూల్‌కు చెందిన టెన్త్ బాలిక రేణుకాదేవి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగ శివరామ్, మణి పాల్గొన్నారు.



బాంబు బ్లాస్టింగ్ ప్రాంతంలో ఇంటింటా సర్వే


దుర్గానగర్‌లో ఇంటింటా సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ఆనుకుని జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్ ప్రభావిత ప్రాంతంలో మంగళవారం రెవెన్యూ అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ గత కొంతకాలంగా కొండను పగులగొట్టేందుకు బాంబు బ్లాస్టింగ్ పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ కారణంగా సమీపంలో ఉన్న దుర్గానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్లు బీటలువారి నష్టపోతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై బాధితులు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహశీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం పట్టణంలో ఇంటింటి సర్వే చేపట్టారు. మంగళవారం దుర్గానగర్‌లో ఇంటింటికి తిరిగి బాంబు బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు ఏ మేరకు దెబ్బతిన్నాయన్న దానిపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలందరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. మంగళవారం గుడివాడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 2026-27 సంవత్సరానికి రూ. 26 కోట్లతో లేబర్ బడ్జెట్‌కు ప్లానింగ్ గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, టీడీపీ మండల మాజీఅధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో ఎక్కడి చెత్త అక్కడే..!

- పది రోజులుగా చెత్త సేకరణ చేయని పారిశుధ్య కార్మికులు
- అధ్వానంగా తయారైన పారిశుధ్యం
- స్వైరవిహారం చేస్తున్న దోమలు


రాట్నాలపాలెంలో రోడ్డు పక్కనే ఉన్న చెత్తచెదారం

కోటవురట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మేజర్ పంచాయతీలో పది రోజుల నుంచి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించలేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఫలితంగా పారిశుధ్యంగా అధ్వానంగా తయారైంది. చెత్త నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలనుంచి కోటవురట్ల మెయిన్ రోడ్డు, ఆస్పత్రి, వసతి గృహాలు ఇళ్ల నుంచి చెత్త సేకరణ చేయడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇళ్లలో చెత్త బుట్టలు నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు యజమానులు ఈ చెత్తను తీసుకు వచ్చి రోడ్డు పక్కన పడేస్తుండగా.. మరికొందరు కాల్చివేస్తున్నారు. బీసీ కాలనీ, యాతపేట, గొల్లపేట, రాట్నాపాలెంల్లో పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీల్లో చెత్తచెదారం కొట్టుకుపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. పంచాయతీలో సంపద కేంద్రం ఏర్పాటు చేయలేదు. గ్రామంలో రోజు విడిచి రోజు చెత్త సేకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శత వర్ష జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించి వ్యాసరచన, వక్తృత్వ, ఇతర పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్‌లో విజేతలకు సత్యసాయి భజన మండలి జోన్ ఇన్‌చార్జి విశ్వేశ్వరరావు, ప్రతినిధులు కక్కిరాల సురేశ్, కొత్త భగవాన్, హెచ్‌ఎం జయశ్రీ, ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, కుమారి, పద్మావతి తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.







పునరావాస కాలనీ పనులు పరిశీలన


పునరావాస కాలనీ వద్ద టీడీపీ నాయకులు

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిడార్ నిర్వాసిత రైతులకు బోదిగల్లం వద్ద ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీ పనులను మంగళవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు తదితరులు లేఅవుట్లు, పునరావాస కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. డ్రైన్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు వంటి పనులు త్వరగా పూర్తిచేయాలని హోం మంత్రి అనిత ఇప్పటికే అధికారులను ఆదేశించినట్టు వెంకటేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బోదిగల్లం, అమలాపురం సర్పంచ్‌లు షేక్ మున్నీషాబేగం, పెదపూడి శంకరరావు, గంటా నర్సింగరావు, సూరకాసుల గోవింద్, ఎరుపల్లి అప్పలరాజు, పుణ్యమంతుల బాబ్జీ, రోకళ్ల గోవింద్ పాల్గొన్నారు.

వరి పంటకు సస్యరక్షణతో మంచి ఫలితాలు


రైతులకు సూచనలిస్తున్న ఏఓ పి.ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు సమగ్ర సస్యరక్షణతో మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండలంలో నామవరం, పీఎల్.పురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన వరి పంటను పరిశీలించి, రైతులకు సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ పంట కాలంలో 32 కేజీల నత్రజని, 24 కేజీల భాస్వరం, 20 కేజీల పొటాష్ వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వరిలో సుడిదోమ నివారణపై అవగాహన


వరిలో సుడిదోమ నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లిపాడు, దోసలపాడు గ్రామాల్లో వరి పొలాలను ఏవో ఉమాప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అక్కడక్కడా కొన్నిచోట్ల వరిలో సుడిదోమ సోకినట్టు గుర్తించారు. సుడిదోమ నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించారు. మందు కొట్టేటప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులు వాడాలని, పొలంలో అక్కడక్కడా దీపపు కాంతి ఎరలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ క్షేత్ర పర్యటనలో ఏఈవో సత్యనారాయణ, శ్రీనివాస్, ఆర్ఎస్‌కే సిబ్బంది లావణ్య, శిరీషా, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ జంప్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పి.నాగమౌనిక, జె తారకలక్ష్మి

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి నాగమౌనిక, జెతారకలక్ష్మి ట్రిపుల్ జంప్ పోటీల్లో సత్తా చాటారు. సోమవారం విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి ట్రిపుల్ జంప్ పోటీల్లో బాలికల విభాగంలో ఈ విద్యార్థినులిద్దరూ చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం జాన్ మెతు షెలా, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, లోవరాజు మంగళవారం తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో నాగమౌనిక, తారకలక్ష్మి పాల్గొంటారని చెప్పారు.

నక్కపల్లి ఎంపీడీవోగా చైతన్య


చైతన్య

నక్కపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఎంపీడీవోగా బి.చైతన్య నియమితులయ్యారు. సబ్బవరంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమెను పదోన్నతిపై నక్కపల్లి ఎంపీడీవోగా నియమించారు. ఆమె మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో డీ సీతారామరాజు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన సీతారామరాజు ఏవోగా కొనసాగుతారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన చైతన్యను పలువురు సెక్రటరీలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు

ఎస్.రాయవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని 19 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా లింగరాజుపాలెం ఎంజేపీ, పెద్దఉప్పలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు శ్రీఆదర్శ హైస్కూలు, వినయ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికైనట్టు చెకుముకి పోటీల జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగడం వరప్రసాద్ తెలిపారు. అంతకముందు మండలస్థాయి చెకుముకి పోటీల ప్రశ్నపత్రాన్ని కొరుప్రోలు పాఠశాల హెచ్‌ఎం కప్పల ప్రసాద్ విడుదల చేశారు

శ్రీప్రకాష్‌లో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం


యూకేజీ విద్యార్థులకు పట్టాలు అందజేసిన దృశ్యం

పాయకరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో మంగళవారం యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరం యూకేజీ పూర్తిచేసిన విద్యార్థులకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జిలు బి.ప్రసూనమౌళి, ఉషారాణి, భార్గవి, సునీత, డీఎల్‌పీ.రాజు పాల్గొన్నారు.









స్పీకర్ అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న నూకాంబిక పాలకవర్గం ప్రతినిధులు

శాసన సభాపతికి సత్కారం

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంకు వచ్చిన శాసన సభాపతి సిహెచ్.అయ్యన్నపాత్రుడును నూకాంబిక ఆలయ నూతన పాలకవర్గం ప్రతినిధులు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ పీలా నాగశ్రీను అయ్యన్నపాత్రుడుకు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భోజనం అదిరింది..

- అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- భోజనం రుచికరంగా ఉందని కితాబు



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో అయిషా

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో భోజనం బాగుతుందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను మంగళవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి భోజనం సమయంలో అన్న క్యాంటీన్‌కు వచ్చి భోజనానికి క్యూలైన్ సిద్ధమైన వారితో మాట్లాడారు. భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు ఆర్డీవో షేక్ ఆయీషా తోటి భోజన ప్రియులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉందని కలెక్టర్ కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ



మరిడిమాంబ జాతర పోస్టర్‌ను కమిటీ సభ్యులతో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో గురువారం నిర్వహించనున్న మరిడిమాంబ జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మంగళవారం ఆవిష్కరించారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జాతరకు పరవాడ, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల వెంకునాయుడు, పైలా రథాల సన్యాసిరావు, వెన్నెల సన్యాసిరావు, పైలా అప్పలనాయుడు, వెన్నెల నరసింహరావు, పైలా ప్రసాద్, లోకిరెడ్డి అబి నాయుడు, బోజంకి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవాన్ని తిలకించిన డీఎస్పీ శ్రావణి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న డీఎస్పీ

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి పుస్తక మహోత్సవ ప్రదర్శనను మంగళవారం సాయంత్రం డీఎస్పీ ఎం.శ్రావణి తిలకించారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించి విలువైన రచనలు ప్రదర్శనలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రేమ్‌కుమార్, వెంకట నారాయణ, అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసకపల్లి-లంకెలపాలెం రోడ్డుకు మోక్షం

- ఆర్‌అండ్‌బీ సీఈ విజయశ్రీ పరిశీలన
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



రోడ్డును పరిశీలించి స్థానిక ప్రజలతో ఆర్అండ్‌బీ సీఈ విజయశ్రీ, అధికారులు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. 'గజానికో గండం' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పైడివాడఅగ్రహారం గ్రామ సమీపంలో ఏర్పడ్డ భారీ గోతులను రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ, అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అసకపల్లి నుంచి లంకెలపాలెం వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర రోడ్డులో ఏడేళ్లుగా భారీ గోతులు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 17 కిలోమీటర్ల మరమ్మతులు చేపట్టడం జరిగిందని, మిగతా ఐదు కిలోమీటర్లు పాక్షికంగా మరమ్మతులు చేపట్టి వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ధ్వంసమైందని, దీంతో వాహన చోదకలు ప్రమాదాలు బారిన పడుతున్నారని ఎంపీటీసీ మంజా సభ్యులు అక్కిరెడ్డి లక్ష్మీ, దుర్గినాయుడు సీఈకి వివరించారు.

అనంతరం సీఈ విజయశ్రీ మాట్లాడుతూ ఈ రోడ్డు బాగు చేసేందుకు పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపించి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ రోడ్డును బాగు చేయాలని ఇప్పటికే ప్రభుత్వంతో మాట్లాడారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ సాంబశివరావు, డీఈ విద్యాసాగర్, జేఈ బాలరాజు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యులు శీరం అప్పలరాజు, నాయకులు అచ్చిబాబు, కోన సత్యనారాయణ, శివరాం, మహేశ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించే శిశు సంరక్షణ కేంద్రాలకే అనుమతులు

ఏడు సంస్థలకు నోటీసుల జారీ : కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్న శిశు సంరక్షణ కేంద్రాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు మంజూరుకు కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న సంస్థలు 43 ఉండగా, వాటిలో మూడు ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ సంస్థల కోసం జిల్లా బాలల సంరక్షణ ఆధ్వర్యంలో జీవో నంబరు-9 ప్రకారం జిల్లా స్థాయి పరిశీలన బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ జిల్లాలోని 43 సంస్థలను పర్యవేక్షించి, వాటి స్థితిగతులను పరిశీలిస్తాయని చెప్పారు. కమిటీ రిపోర్టు ఆధారంగా 35 సంస్థలకు నేరుగా రిజిస్ట్రేషన్ కోసం అవకాశం కల్పించినట్టు చెప్పారు నిబంధనలు ప్రకారం మౌలిక సదుపాయాలు లేని ఏడు సంస్థలను నోటీసులు జారీ చేయాలని, అందులో ఆశ్రయం పొందుతున్న చిన్నారులను దగ్గరలో గల ఇతర సంస్థలలో ఆశ్రయం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని శిశు గృహ సంరక్షణ కేంద్రం సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, నిరాశ్రయ పిల్లలను గుర్తించి అందులో ఆశ్రయం కల్పించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాలలో చిన్నారులు ఏ పాఠశాలలో చదువుతున్నారనే వివరాలు సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. నిబంధనలు అమలు జరిగేలా చూడాలని, అన్ని నిబంధనలు సరిగా పాటించిన తరువాతే అనుమతులకు సిఫారసు చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా

తుమ్మపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. తుమ్మపాల, బవులవాడ, తగరంపూడి, మెట్టపాలెం గ్రామాల్లో సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతున్నదన్నారు. ప్రతీ ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారన్నారు. పేదలను అన్ని అంశాల్లో ఆదుకోవడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 12 మందికి మంజూరైన రూ.11 లక్షల 38 వేలు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు ఆడారి గోవిందరావు, పీలా బుజ్జి, వియ్యపు సింహాచలం, గొర్లి శ్రీనివాసరావు, రాపేటి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేయించుకోండి

- జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సూచించారు. పట్టణంలో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆధార్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, రుసుములను తెలుసుకున్నారు. అనంతరం జడ్సీ మాట్లాడుతూ ఐదు నుంచి 15 ఏళ్ల వారికి ఉచితంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు. అలాగే నెయ్యిలవీధిలోని కాలువను పరిశీలించారు. ఎప్పటికప్పుడు కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కౌశల్యం సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని, ఈ సర్వే ద్వారా అర్హత ఉన్న ప్రజలకు ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని జడ్సీ చెప్పారు. జోన్ పరిధిలోని 27 సచివాలయాల్లో కౌశల్యం పరీక్షలు కూడా ఈ వారంలోనే జరుగుతాయని, ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వం వర్క్ ఫ్రం హోమ్ అవకాశాలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సచివాలయంలో తనిఖీలు చేస్తున్న జడ్సీ చక్రవర్తి

ప్రధాన ఆలయాల కమిటీలతో అధికారుల సమావేశం



సోమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన ఆలయాలకు సంబంధించిన కమిటీలతో మంగళవారం అధికారులు సమావేశాలు నిర్వహించారు. లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి, పెదయాతపాలెం గౌరీ పరమేశ్వరస్వామి ఆలయాలను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సీఐ జి.రామచంద్రరావు తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల సభ్యులతో వారు మాట్లాడుతూ కార్తీక మాసం, కార్తీక పౌర్ణమి నేపథ్యంలో ఆలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, పక్కాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే సమన్వయ కమిటీలు నియమించాలని వారు చెప్పారు. ఎక్కడికక్కడ బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. తోపులాటలు లేకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని వారు తెలిపారు. భక్తులు క్రమశిక్షణగా దైవ దర్శనాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డీఆర్వీ సత్యనారాయణ, సర్పంచ్ దాడి లావణ్య, కన్నంనాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాపేటి అరుణ, రాము, శరగడం శంకరరావు, రామునాయుడు, అర్చకులు డి.శేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని విరమించుకోవాలి

- వైసీపీ కోటి సంతకాల సేకరణలో అమర్‌నాథ్



శిబిరంలో సంతకాలు చేస్తున్న అమర్‌నాథ్, నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో మార్చడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కోరారు. నెహ్రూచౌక్‌లో మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తతందని ఈ కళాశాలలను ఏర్పాటు చేస్తే, ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం సరికాదన్నారు. ఈ విధానాన్ని విరమించకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నాయకులు బొడ్డేడ ప్రసాద్, బీవీ సత్యవతి, ఎం.జానకిరామరాజు, దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. మంగళవారం రాత్రి సిబ్బందితో కలిసి ఆయన లంకెలపాలెం, పరవాడ సినిమాహాల్ జంక్షన్ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న, పరిమితికి మించి అధికలోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్లకు జరిమానాలు విధించారు. అలాగే విస్తృతంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ భద్రత కోసం ప్రజలందరూ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎంవీఐ గోపికృష్ణ, ఎస్ఐలు మహలక్ష్మి, కృష్ణారావు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిలో వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

సంపద కేంద్రాలను నిర్వహణలోకి తేవాలి

- జిల్లా పంచాయతీ అధికారి సందీప్



కశింకోటలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సందీప్

కశింకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ సూచించారు. కశింకోటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు చెత్తచెదారాన్ని తరలించాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల్లోఅభివృద్ధి పనులకు వినియోగించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేకపోతే చర్యలు తప్పవు

- అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, డీటీసీ డీఎస్పీ మోహనరావు



కొత్తూరు కాలేజీ కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీలు

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రికార్డులు లేని వాహన చోదకులపై చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, జిల్లా ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ మోహనరావు హెచ్చరించారు. కొత్తూరు పంచాయతీలోని కాలేజీ కూడలిలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణను కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, నిర్దేశించిన వేగంతోనే ప్రయాణించాలని సూచించారు. తగిన నిబంధనలు పాటించి తోటి ప్రయాణికులు సురక్షిత ప్రయాణం చేసేలా నడుచుకోవాలన్నారు. అతి వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పూడిమడక వెళ్లే జంక్షన్‌లోని జాతీయ రహదారిపై పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో తుప్పలు తొలగించరూ..

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానవాటిక ప్రాంగణంలో పెరిగిపోయిన తుప్పలు, ముళ్ల పొదలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. నెలల తరబడి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఆ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. దీనికితోడు చికెన్ వ్యర్థాలను సంబంధిత షాపుల యజమానులు శ్మశానవాటిక పరిసర ప్రాంతాల్లో పడవేయడంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. శ్మశానవాటికను పరిశుభ్రంగా తయారు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ముళ్ల పొదల కారణంగా అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి శ్మశానవాటికలో ముళ్ల పొదలు తొలగించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా తయారు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు ఉన్నత పాఠశాలకు బాటజంగాపాలెం సర్పంచ్ పడాల వెంకట రమణ మంగళవారం రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం టి.పద్మ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సేనాపతి రాము దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ వనం లక్ష్మీ, పందిరిపల్లి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు మంగళవారం కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని మలునాయుడుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచులు బండారు మంగ, బోను దేముడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి కనకరాజు, పార్టీ నాకులు గండి రవికుమార్, కొటాన రాము, కర్రి బాబు, యడ్ల నాయుడు, బండారు శ్రీను, ఐడి బాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పీఆర్‌టీయూ కార్యదర్శి పెద్దినాయుడు

సబ్బవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.పెద్దినాయుడు డిమాండ్ చేశారు. సబ్బవరంలో మంగళవారం పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంగినారపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు ఇవ్వాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొబ్బిలి అప్పలరాజు, రాష్ట్ర కార్యదర్శి సత్యంనాయుడు, మండల బాధ్యులు అప్పలనాయుడు, వనం భాష్కరరావు, ఆనంద్, కె.కృష్ణ, అప్పారావు, అశోక్‌కుమార్, గోవింద పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన చిన్ని నాగమణి వంట గదిలో నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పివేసి నాగమణిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతుందన్నట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా మత్తు పదార్థాల వినియోగం జోలికి వెళ్లకూడదని పరవాడ ఎస్ఐ మహలక్ష్మి సూచించారు. మండలంలోని తానాం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. సముద్ర తీరాలు, నీటి ప్రదేశాలు, చెరువుల వద్దకు వెళ్లకూడదన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గణేశ్, బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ పీఎల్ నారాయణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి పోటీలు

మాకవరపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. సైన్స్ సంబరాల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మాకవరపాలెం, కోడూరు, వజ్రగడ, బూరుగుపాలెం, జంగాలపల్లి, గిడుతూరు, కృపాకమల్ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు మాట్లాడుతూ చెకుముకి పోటీల వల్ల విద్యార్థుల్లో పట్టుదల పెరుగుతుందన్నారు. తద్వారా చదువుపై శ్రద్ధ ఏర్పడుతుందని చెప్పారు. మూఢ నమ్మకాలు వల్ల ఎన్నో జీవితాలు నాశనమతున్నాయన్నారు. ప్రజల కోసం, ప్రగతి కోసమే సైన్స్ అని, అందువల్ల విద్యార్థులు సైన్స్‌పై మక్కువ చూపించాలని ఆయన సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.





ఆదాయ వనరులపై ఏఎంసీ దృష్టి

- ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వ్యాపారులకు తాఖీదులు
- రైస్ మిల్లర్ల నుంచి పాత బకాయిల వసూళ్లు
- ఈ ఏడాది లక్ష్యానికి మించి ఆదాయం వచ్చే అవకాశం
- కొత్త పాలకవర్గం పగ్గాలు చేపట్టాక పెరిగిన ఆదాయం

నర్సీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వనరులపై మార్కెట్ కమిటీ ప్రత్యేక దృష్టిసారించింది. వివిధ మార్గాల్లో ఆదాయ సమీకరణ కోసం తగిన చర్యలు చేపడుతోంది. ప్రధానంగా చెక్‌పోస్టులపై పర్యవేక్షణ పెంచింది. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.

నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఈ ఏడాది జూన్ 27న ప్రమాణ స్వీకారం చేసింది. అప్పటి నుంచి ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ మార్కెట్ కమిటీ ఆదాయంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా నర్సీపట్నం నియోజవర్గంలోని ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, రైస్ మిల్లర్లు నుంచి సెస్సు బకాయిలు రాబట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అయ్యన్నపాలెంలోని హిందూ రైస్ ప్రొడక్ట్స్ నుంచి రూ.4.58 లక్షలు, బలిఘట్టం షణ్ముఖ రైస్ మిల్లు నుంచి రూ.2.61 లక్షలు, గైరంపేటలోని శ్రీరామా మోడరన్ రైస్ మిల్ నుంచి 2.74 లక్షలు, దాలింపేటలోని డీబీ రైస్ ట్రేడర్స్ నుంచి రూ.2.31 లక్షలు, నాతవరంలోని హిమగిరి ఉమామశ్వర రైస్ మిల్లు నుంచి రూ.73 వేలు, ఎంటీపట్నంలోని లక్ష్మీ గణపతి రైస్ ట్రేడర్స్ నుంచి రూ.63 వేలు, పీకే గూడెంలోని వేంకటేశ్వర ఫ్లోర్ అండ్ రైస్ మిల్ నుంచి రూ.34 వేలు సెస్సు బకాయిలు వసూళ్లు చొప్పున 2024-25 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.14 లక్షల ఆదాయం రాబట్టారు.

అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ పరధిలోని బలిఘట్టం, గన్నవరం మెట్ట, రాజుపేట చెక్‌పోస్టులపై పర్యవేక్షణ పెంచడంతో మంచి ఫలితాలు వచ్చాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బలిఘట్టం చెక్ పోస్టు ద్వారా రూ.23 లక్షలు ఆదాయం వస్తే, ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబరు వరకు కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రూ.22.81 లక్షల ఆదాయం వచ్చింది. గన్నవరం చెక్‌పోస్టు ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.18.38 లక్షలు ఆదాయం వస్తే, ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలో రూ.19.38 లక్షలు వచ్చింది. రాజుపేట చెక్‌పోస్టు (అబ్జర్వేషన్ పాయింట్) ద్వారా గత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.8 లక్షలు ఆదాయం వస్తే, ఇప్పుడు నాలుగు నెలలకి రూ.4.68 వచ్చింది. ఇది కాకుండా జీడి పిక్కలు ఫ్యాక్టరీల నుంచి సెస్సు వసూళ్లు చేయడానికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు జీడిపిక్కల ఫ్యాక్టరీల నుంచి సెస్సు చెల్లించడం లేదు. అదే విధంగా జీడి పిక్కలు, జీడి పప్పు ఎగుమతి మీద సెస్సు ఆదాయం పెంచడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇటీవల ఆర్టీసీ కార్గో బస్సులో సెస్సు చెల్లించకుండా తరలిస్తున్న తొమ్మిది టన్నులు జీడిపప్పు మీద రూ.60 వేలపైగా సెస్సు కట్టించారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులలో హైదరాబాద్‌కు జీడిపప్పు అధికంగా రవాణా చేస్తుండడంతో నిఘా కట్టుదిట్టం చేశారు.

మార్కెట్ ఫీజు ద్వారా రూ.2.7 కోట్లు ఆదాయం లక్ష్యం కాగా, నాలుగు నెలలకు రూ.78.17 లక్షలు రాబట్టారు. రోజుకు రూ.2500 టర్నోవర్‌తో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటుచేసి, ట్రేడ్ లైసెన్స్ ఫీజు తప్పనిసరిగా చెల్లించాలని స్పష్టం చేశారు. ఫలితంగా ఇటీవల 11 మంది ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించడానికి ముందుకు వచ్చారు. దీంతో మార్కెట్ ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.


నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

డ్వాక్రా సంఘాల్లో పుస్తక నిర్వహణకు ప్రాధాన్యం

వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ వాసు

కృష్ణాదేవిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే పుస్తక నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ వాసు స్పష్టం చేశారు. గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక నిర్వహణ పారదర్శకత కోసం 'మన డబ్బులు-మన లెక్కలు' అనే యాప్ వచ్చిందని చెప్పారు. పొదుపు, అప్పులకు సంబంధించిన వివరాలన్నీ సభ్యురాలు తమ ఫోన్‌లోనే ప్రతీ నెల చూసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఆర్థిక లావాదేవీలు సభ్యులకు పూర్తి స్థాయిలో తెలియాలనే ఉద్దేశంతోనే ఈ యాప్‌ను సెర్ప్ ప్రవేశపెట్టిందన్నారు. వీటిని డ్వాక్రా సంఘాల సభ్యులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వీవోలు వరలక్ష్మి, రమణ, రజిని, ఉమారత్నం తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా సభ్యుల సదస్సులో మాట్లాడుతున్న సీసీ వాసు



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

గొలుగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని ప్రకృతి సిద్ధంగా పండించిన చిరుధాన్యాలు, కూరగాయలు, బియ్యం ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆయన సూచించారు. రైతులు వర్మీకంపోస్టు ఎరువులు, జీవామృతాలు ఉపయోగించి వ్యవసాయ సాగు చేసేలా ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది కరుణానిధి, అమ్మాజీ, చిరుధాన్యాలు సాగు రైతులు గొల్లి సత్యనారాయణ, పెట్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.



వనరుల కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం



తాడపాల రహదారిపై మట్టి తొలగింపు


తాడపాలలో ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును శుభ్రం చేస్తున్న దృశ్యం

మాకవరపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడపాల రహదారిపై పెరిగిపోయిన మట్టిని మంగళవారం తొలగించారు. కొన్ని నెలలుగా ఈ రహదారిపై మట్టి పేరుకుపోవడంతో ప్రజలు, వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికారులకు తెలిపినా ఏమాత్రం పట్టించుకోలేదని, దీంతో రోడ్డులో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన రాజారావుకు తమ గోడు విన్నవించుకున్నామని ఆయన స్పందించి సొంత నిధులతో రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టిని తొలిగించారని దళిత కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



రికార్డులు లేకపోతే చర్యలు తప్పవు

డీఎస్పీలు శ్రావణి, మోహనరావు

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రికార్డులు లేని వాహన చోదకులపై చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, జిల్లా ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ మోహనరావు హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో కొత్తూరు పంచాయతీ పరిధిలోని కళాశాల కూడలిలో మంగళవారం విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణను కచ్చితంగా హెల్మెట్ ధరించాలని వాహన చోదకులకు సూచించారు. అలాగే నిర్దేశించిన వేగంతోనే ప్రయాణించాలని ఆదేశించారు. ప్రధానంగా జాతీయ రహదారిపై ప్రయాణాలు చేసేటప్పుడు తగిన నిబంధనలు పాటించి తోటి ప్రయాణికులు సురక్షిత ప్రయాణం చేసేలా నడుచుకోవాలని సూచించారు. అతి వేగం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పూడిమడక వెళ్లే జంక్షన్‌లోని జాతీయ రహదారిపై పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధనలపై సమాచారం ఇవ్వండి

గొలుగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో అన్న సమారాధనలకు ముందస్తు సమాచారం అందించాలని ఎస్ఐ రామారావు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గల దేవాలయాల్లో వన భోజనాల కార్యక్రమాలు నిర్వహిస్తే తమకు తెలపాలని ఆయన స్పష్టం చేశారు. భద్రతా పరంగా పలు సూచనలు ఇస్తామని, వాటిని కమిటీ సభ్యులు పాటించాలని చెప్పారు.

మహిళకు గాయాలు

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన చిన్ని నాగమణి వంట గదిలో నిప్పంటుకుని గాయపడింది. ఈ సంఘటనను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పివేసి నాగమణిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతుందన్నట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.













బయోమెట్రిక్ లేకపోతే జీతం నిలుపుదల

ఎంపీడీవో సత్యశ్రీనివాసు




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యశ్రీనివాసు

నాతవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు వేయకపోతే జీతం నిలుపుదల చేస్తామని ఎంపీడీవో సత్యశ్రీనివాసు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

అలాగే ప్రభుత్వం ఆదేశించిన అన్ని సర్వేలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తారకేశ్వరరావు మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వాహకులు దేవాలయాల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం నిర్వాహకులు ముందుగా పోలీసులకు వివరాలు తెలపాలని స్పష్టం చేశారు. కోరారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ జోగారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దత్తు, ఉపాధి హామీ పథకం ఏపీవో కొండాజీ పాల్గొన్నారు.

చీడిగుమ్మలలో విద్యార్థులకు నైపుణ్య పరీక్షలు

గొలుగొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మంగళవారం నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను హెచ్‌ఎం ఆనందరావు పరిశీలించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి పంపిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





నిబంధనలు పాటించే శిశు సంరక్షణ కేంద్రాలకే అనుమతులు

ఏడు సంస్థలకు నోటీసుల జారీ : జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్న శిశు సంరక్షణ కేంద్రాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు మంజూరుకు కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న సంస్థలు 43 ఉండగా, వాటిలో మూడు ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ సంస్థల కోసం జిల్లా బాలల సంరక్షణ ఆధ్వర్యంలో జీవో నంబరు-9 ప్రకారం జిల్లా స్థాయి పరిశీలన బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ జిల్లాలోని 43 సంస్థలను పర్యవేక్షించి, వాటి స్థితిగతులను పరిశీలిస్తాయని చెప్పారు. కమిటీ రిపోర్టు ఆధారంగా 35 సంస్థలకు నేరుగా రిజిస్ట్రేషన్ కోసం అవకాశం కల్పించినట్టు చెప్పారు నిబంధనలు ప్రకారం మౌలిక సదుపాయాలు లేని ఏడు సంస్థలను నోటీసులు జారీ చేయాలని, అందులో ఆశ్రయం పొందుతున్న చిన్నారులను దగ్గరలో గల ఇతర సంస్థలలో ఆశ్రయం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని శిశు గృహ సంరక్షణ కేంద్రం సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, నిరాశ్రయ పిల్లలను గుర్తించి అందులో ఆశ్రయం కల్పించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాలలో చిన్నారులు ఏ పాఠశాలలో చదువుతున్నారనే వివరాలు సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. నిబంధనలు అమలు జరిగేలా చూడాలని, అన్ని నిబంధనలు సరిగా పాటించిన తరువాతే అనుమతులకు సిఫారసు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







ముమ్మరంగా పారిశుధ్య పనులు



కాలువలో పూడికతీత పనులు చేయిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఎస్టీ కాలనీ, గొల్లవీధిలో డ్రైనేజీల్లో నెలలు తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కూలీలతో తీయించారు. పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన స్పందించి ఈ పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోచల సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్, పాలకవర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.



సంపద కేంద్రాలను నిర్వహణలోకి తేవాలి

» జిల్లా పంచాయతీ అధికారి సందీప్

కశింకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ సూచించారు. కశింకోటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు చెత్తచెదారాన్ని తరలించాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల్లోఅభివృద్ధి పనులకు వినియోగించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

» పరవాడ డిఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. మంగళవారం రాత్రి సిబ్బందితో కలిసి ఆయన లంకెలపాలెం, పరవాడ సినిమాహాల్ జంక్షన్ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయడం, మైనర్లు వాహన డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించి అధికలోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీ డ్రైవర్లకు జరిమానాలు విధించారు. అలాగే విస్తృతంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ భద్రత కోసం ప్రజలందరూ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎంవీఐ గోపీకృష్ణ, ఎస్ఐలు మహలక్ష్మి, కృష్ణారావు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థినికి గుండె ఆపరేషన్


కోలుకున్న విద్యార్థిని లోవకుమారి

జి.మాడుగుల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈ ఎంఆర్ఎస్ ఏకలవ్య పాఠశాలలోని విద్యార్థినికి విజయవంతంగా గుండె శస్త్రచికిత్స పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివ్‌సింగ్ చౌహన్ అందించిన వివరాలివి... ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదుతున్న ఎస్. లోవకుమారి గత కొన్నేళ్లుగా గుండె జబ్బుతో బాధపడుతోంది. దీంతో ప్రిన్సిపాల్.. గురుకుల కార్యదర్శి ఎం.గౌతమి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారు. వారు స్పందించి నెస్ట్ సంస్థ (నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ ఢిల్లీ)ని సంప్రదించారు. వారి సహకారంతో అక్టోబరు 10న విశాఖ మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. రూ. 7.67లక్షలు వెచ్చించి అక్టోబరు 27వ తేదీన శస్త్రచికిత్స చేసి, ఈ నెల 3న విద్యార్థినికి డిశ్చార్జి చేశారు. ఈ చికిత్సకు సహకరించిన కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, గురుకులం కార్యదర్శి గౌతం, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ, ఇతర ఉన్నతాధికారులకు ఆ చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం చలపతిరావు, ఉపాధ్యాయులు

పెదబయలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన సీకరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు వి. చలపతిరావు తెలిపారు. సోమవారం విశాఖలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా పోటీలలో అండర్-14 అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో కిల్లో రాజు ప్రథమ స్థానం నిలిచారన్నారు. అండర్-17 జావెలిన్ త్రోలో కిరసాని బాబూజీ ద్వితీయ స్థానం సాధించారన్నారు. వీరిద్దరూ ఈ నెల 8,9 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారన్నారు. ఈ విద్యార్థులు, వ్యాయమ ఉపాధ్యాయుడు సీకరి బాలకృష్ణకు అభినందించారు.

కాఫీ కార్మికుల ఆందోళన

పెదబయలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చుట్టుమెట్ట కాఫీ ప్లాంటేషన్ కూలీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కాఫీ పండ్ల సేకరణలో కిలోకి రూ.10 పెంచాలని, కూలీ రేటు రూ. 500 చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో రెయిన్ కోట్స్ ఇవ్వాలని, పని సమయంలో ఎవరైనా ప్రమాదం బారినపడితే ఆస్పత్రి ఖర్చులు యాజమాన్యమే భరించాలని కోరారు. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మికులు నాగరాజు, స్వామి, కృష్ణారావు, సోనియా, మాధవరావు, మల్లేశ్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో తీరిన తాగునీటి సమస్య


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లో రక్షిత మంచి నీటి పథకాన్ని మంగళవారం ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత ప్రారంభించారు. సాయినగర్ వీధిలో సుమారు 300కుటుంబాలుంటున్నాయి. సీపీడబ్ల్యూ పథకం ద్వారా పంచాయతీలో నీటి సరఫరా చేస్తున్నా, సాయినగర్ ప్రజల వరకు చేరడంలేదు. ఈ నీటి సమస్యను ఎంపీపీ, డ్పీటీసీ సభ్యులు జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె రూ. 10 లక్షల నిధులు కేటాయించారు. ఈనిధులతో రక్షిత పథకం నిర్మించి, పబ్లిక్ కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చిందాడ జయలక్ష్మి, దాసరి దారలక్ష్మి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడికి అస్వస్థత


సీపీఆర్ చేస్తున్న సచివాలయం ఉద్యోగులు

గూడెంకొత్తవీధి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవెదురుపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు ఎంవీవీ ఎస్ ఎన్ మూర్తి గుండె పోటుకు గురయ్యారు. అయితే, సచివాలయ ఉద్యోగులు సకాలంలో స్పందించి అతనికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలివి..ఉపాధ్యాయుడు మూర్తి మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసి కుర్చీలో కూర్చోని ఉండగా... గుండెనొప్పి రావడంతో కింద పడిపోయారు. అదే సమయంలో ఆది కర్మయోగి కార్యక్రమానికి వెళ్లిన సచివాలయ ఉద్యోగులు గుర్తించి ఉపాధ్యాయుడికి సీపీఆర్ చేశారు.కొంత సమయానికి స్పృహ రావడంతో ఆర్వీనగర్ ఆస్పత్రికి తీసుకుని వెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. ఉపాధ్యాయుడు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మహిళా ఉద్యోగుల స్ఫూర్తితో రాణించాలి: ఎస్పీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్ధార్

హుకుంపేట నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మహిళా ఉద్యోగులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎస్పీ అమిత్ బర్ధార్ సూచించారు. మంగళవారం స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను సందర్శించారు. తరగతి గదులు, హాస్టల్ వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహిళలు బాగా చదువుకుని ఉద్యోగులు రాణిస్తున్నారన్నారు. అనేక మంది మహిళ పోలీసులుగా పనిచేస్తున్నారన్నారు. వీరిని స్ఫూర్తిగా విద్యార్థినులు తీసుకోవాలని కోరారు. జీవితాల్లో ఉన్నతంగా స్థిర పడిన తర్వాత తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు. సెలవులు పూర్తయిన తర్వాత తిరిగి పాఠశాలకు అమ్మానాన్నలతోనే పాఠశాలలకు రావాలని కోరారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలతో అనేక అనర్థాలు ఎదురవుతాయన్నారు. ఎవరైనా ఇలాంటి వారు వెంట పడితే ఉపాధ్యాయులు, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ షహబాజ్ అహమ్మద్ , స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ, పాఠశాల హెచ్ఎం మీనా కుమారి, వార్డెన్ జ్యోతి కుమారి, పోలీసులు సూర్యనారాయణ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాగా చదవాలి: సీఐ

చింతపల్లి: విద్యార్థినులు పట్టుదలతో విద్యలో రాణించాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో సీఐ సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే రాణించగలరన్నారు. విద్యార్థినులు అనుమతిలేకుండగా పాఠశాల విడిచి గృహాలకు వెళ్లరాదన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి వేళలో ఉపాధ్యాయులు విద్యార్థినులకు అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ ఎం.వెంకటరమణ, పీజీహెచ్ఎం బీఎస్ఎన్ పడాల్, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

▸▸ పాడేరు మండల సమావేశంలో సభ్యులు ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నకుమారి

పాడేరురూరల్, నంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత మండల సర్వసభ్య సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎంపీపీ ఎస్.రత్నకుమారి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి. గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, లగిశపల్లి ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు మాట్లాడుతూ గత సమావేశాల్లో దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సైతం ప్రజా ప్రతినిధులకు తెలియజేయడంలేదని ఆరోపించారు. గ్రామాల్లో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని గత రెండు సమావేశాల నుంచి కోరుతున్నా విద్యుత్ శాఖాధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. హార్టికల్చర్ అధికారులు బంతి పూల సాగు రైతులకు అందించే రాయితీలనుకూడా సర్పంచ్‌లకు తెలియకుండా పంపిణీ చేస్తున్నారన్నారు. గృహ నిర్మాణ శాఖాధికారులు బిల్లు సకాలంలో చేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. మ్యుటేషన్లలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వల్ల రైతులు పలు సంక్షేమ పథకాలు సకాలంలో పొందలేక పోతున్నారన్నారు. చాలా గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంలో విద్యాశాఖాధికారులు విఫలమవుతున్నారన్నారు. ప్రధానంగా పంచాయతీల సరిహద్దు సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, అటవీశాఖాధికారులు కృషి చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. గిరిజన గ్రామాల్లో సారా, మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. వీటి నిరోధంలో ఎక్సైజ్ శాఖ విఫలమైనట్టు పలువురు విమర్శించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జె.తేజరతన్, డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌వీఎస్.రమేశ్, ఏవో పీఆర్‌సీ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో, హెచ్ఎం

అరకులోయ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మ ంగళవారం చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది చిన్నారులకు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి ఎంఈవో భారతీరత్నం, హెచ్ఎం మోహనరావు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ, విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం ప్రాముఖ్యతను వివరించారు. సెల్‌ఫోన్‌ల తో సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన ఈ విద్యార్థులు త్వరలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సహాయకార్యదర్శి డాక్టర్ సు బన్ బోద్నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పదం పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదబయలు: సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాయ్స్-1 పాఠశాలకు చెందిన కృష్ణ చైతన్య, సామ్యుల్‌పౌల్, రాజుప్రథమ స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం పండన్న తెలిపారు. రెండవ స్థానంలో సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు, మూడో స్థానంలో అరడకోట జీటీడ బ్ల్యూ పాఠశాల విద్యార్థులు నిలిచారన్నారు. ఈ విద్యార్థులకు గైడ్‌గా వ్యవహ రించిన సైన్సు టీచర్ చెండా బాలకృష్ణను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి, సారాకు దూరంగా ఉండాలి: డీఎస్పీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ షహబాజ్ అహమ్మద్

పాడేరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి, నాటు సారాకు ప్రజలు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ కోరారు. మండలంలోని డోకులూరు సచివాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి సాగు, రవాణా వంటివాటికి సహకరిస్తే కేసుల్లో చిక్కుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గంజాయి వ్యసనం వల్ల కుటుంబాలు సర్వనాశనం అవుతాయన్నారు. నాటు సారా తయారీ, అమ్మకాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. చెడుపు, చిల్లంగి వంటి మూఢ నమ్మకాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. అనారోగ్యానికి గురైన వారు వెంటనే ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలను చేయించుకుని మందులను సకాలంలో వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, ఎస్ఐ ఎల్.సురేష్, పంచాయతీ సర్పంచ్ కె.సన్నిబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో స్వచ్ఛభారత్

సీలేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలేజీ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. మొక్కలను పశువులు, మేకలు తినకకుండా చుట్టూ గ్రీన్ క్లాత్ కట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ వి. శంకరరావు, ఎన్ఎస్ఎస్ లెక్చరర్ శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


డిగ్రీ కళాశాల ఆవరణలో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

పాడేరురూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని అక్రమ నిర్మాణాలను సంయుక్త కలెక్టర్ సాహిత్ పర్యవేక్షణలో తహసీల్దార్ డి.అరుణ్ చంద్ర, రెవెన్యూ సిబ్బంది మంగళవారం తొలగించారు. కళాశాల కార్యాలయం వెనుక భాగంలో కొంత స్థలాన్ని కొంతమంది ఆక్రమించి రేకు షెడ్లు నిర్మించారు. ఈ విషయాన్ని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఎక్స్‌కేవేటర్ సహాయంతో వాటిని తొలగించారు. కళాశాల స్థలాలు పరిరక్షణకు చర్యలు తీసుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి, కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు బి.నల్లన్న, మర్రిచెట్టు రామునాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

అదనపు తరగతి భవనాలు మంజూరు


కొమ్ములవాడలో తల్లిదండ్రులతో సమావేశమైన ఇంజనీరింగ్ అసిస్టెంట్

సీలేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని కొమ్ములవాడ జీటీడబ్ల్యూ, డి. అగ్రహారం ఎపీపీ పాఠశాలల్లో అదనపు తరగతి భవనాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు దుప్పులవాడ సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమారాణి తెలిపింది. మంగళవారం ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన బడి- మన భవిష్యత్తులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు తరగతి గదులు మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క దానికి రూ. 14.65 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ నిర్మాణాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల హెచ్ఎంలతో నూతన కమిటీలను ఏర్పాటు చేశా మన్నారు. కొమ్ములవాడ జీటీడబ్ల్యూఎస్ పాఠశాలలో ఒకటి నుంచి 5 వరకు 35 మంది విద్యార్థులు, డి అగ్రహారంలో 44 మంది విద్యార్థులు ఉన్నట్టు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె భవానీ, ఉపాధ్యాయులు శ్రీదేవి, నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేశ్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు బిర్సా ముండా


మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సాధనతో పాటు గిరిజన హక్కుల కోసం పోరాడిన మహావ్యక్తి బిర్సా ముండా అని స్థానిక ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. బిర్సా ముండా జయంతి వేడుకలు పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం సాధనకు బిర్సాముండా ప్రాణాలను పణంగా పెట్టి బ్రిటీష్ వారితో పోరాడారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పాఠశాలలో ప్రాణాలు విడిచిన ఉపాధ్యాయుడు


మృతి చెందిన ఉపాధ్యాయుడు భగవాన్

హుకుంపేట నవంబరు 4 (ఆంధ్రజ్యోతి); పాఠశాలలో విధుల్లో ఉంటూ ఉపాధ్యాయుడు అస్వస్థతకు లోనై మృతి చెందారు. మంగళవారం మండలంలోని బొడ్డాపుట్టు పంచాయతీ పరిధి గత్తున్ జీపీఎస్ పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. బొడ్డాపుట్టుకు చెందిన ఉపాధ్యాయుడు కిల్లో భగవాన్ (56) సోమవారం పాఠశాలకు వెళ్లారు. తిరిగి తాను ఉంటున్న బొడ్డాపుట్టుకు వెళ్లలేదు. గత్తున్‌లోనే రాత్రి ఉండిపోయారు. ఆయన మంగళవారం ఉదయం పిల్లలతో కలిపి పాఠశాలకు వెళ్లారు. కొద్ది సమయానికి అతను అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామస్థులు భగవాన్‌ను ఆ స్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే మృతి చెందారు. వెంటనే విషయం అతని కుటుంబ సభ్యుల సమాచారంపై స్థానిక ఎంఈఓలు చెల్లయ్య, ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భగవాన్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు. భగవాన్ భార్య, పిల్లలను ఓ దార్చారు. అంత్యక్రియలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించారు.

ఐసీడీఎస్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పాడేరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన శిశు గృహాలలో మేనేజర్, ఆయా పోస్టులకు మంగళవారం జిల్లా సెలక్షన్ కమిటీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శిశు గృహ మేనేజర్ 1 పోస్టుకు ముగ్గురు, మూడు ఆయా పోస్టులకు 12 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిని మహిళా శిశు సంక్షేమాధికారిణి, జువైనల్ జస్టిస్ మెంబర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, నేచర్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా బాలల సంరక్షణ అధికారులు ఇంటర్వ్యూ చేశారు.

విద్యా ప్రమాణాల పెంపునకు డీఏఎఫ్: డీఈవో



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా జిల్లా అకడెమిక్ ఫోరం (డీఏఎఫ్) పనిచేస్తుందని డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. అన్ని పాఠశాలలో విద్యా నాణ్యతను పెంపొందించడం, చిన్నారుల అభ్యాస ఫలితాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా పాఠశాల విద్యా శాఖ చేపడుతున్న పలు కార్యక్రమాలు, సంస్కరణలను సమర్థంగా పర్యవేక్షించడానికి జిల్లా విద్యా వేదిక (డీఏఎఫ్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఫోరం తొలిసమావేశం సమావేశం మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో రానున్న 10వ తరగతి పరీక్షలలో చిన్నారులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. శతశాతం ఉత్తీర్ణ సాధించడమే లక్ష్యంగా డీఏఎఫ్ పనిచేస్తుందన్నారు. ఏపీసీ వి.స్వామినాయుడు, అసిస్టెంట్ కమిషనర్(పరీక్షలు)ఆర్.శశికుమార్, భీమిలి డైట్ లెక్చరర్ షేక్ అల్లా ఉ ద్దీన్, డీసీఈబీ సెక్రటరీ కె.సువర్ణరాజు, ఎంఈవోలు కె.కృష్ణమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

పశు సంపద అభివృద్ధిపై అవగాహన ఉండాలి

▸▸ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జయరాజ్


మాట్లాడుతున్న జిల్లా అధికారి జయరాజ్

పెదబయలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశు సంపద అభివృద్ధిపై గిరిజన రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి. జయరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని అడుగులపుట్టు రైతు సేవా కేంద్రం వద్ద పశు సంవర్ధక ఏడీ ఎస్. కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రధాన మంత్రి ధన్- ధాన్య కృషి యోజనలో భాగంగా కృత్రిమ గర్భధారణపై రైతులకు జరిగిన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక పాల ఉత్పత్తికి జెర్సీ, ఎచిప్, ముర్రా, అలాగే, దేశీయ జాతి గిర్రు, సాహివల్, ఒంగోలు, పుంగనూరు తదితర రకాల ఆవులు పెంచాలన్నారు. డాక్టర్ విజయ్ పాణిగ్రహి, వైద్య సిబ్బంది మరియా, వరలక్ష్మి, యమున, ధర్మారావు, మాధవి, పరమేశ్, దేవరాజ్, గణేష్ పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు


సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి అబ్బాయి

చింతపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధి విద్య కోర్సులను అభ్యసించిన విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టి అబ్బాయి అన్నారు.మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉష పథకం ద్వారా ఐదు సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశ పెట్టారు. స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఐదు రోజులపాటు హైదరాబాద్‌కి చెందిన రిసోర్సు పర్సన్ శిక్షణ అందచేస్తారన్నారు. పీఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ వి. రమణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డి. కె జియ, రవీంద్ర నాయక్, కోర్సు కన్వీనర్ వర ప్రసాద్, శరత్ బాబు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

అనంతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలకు గిరిజనులు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ డి. శ్రీనివాసరావు సూచించారు. అనంతగిరి పంచాయతీ నందిగుమ్మిలో ఇరువర్గాల మధ్య నెలకొన్న ఓ వివాదంపై ఎస్ఐ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యులు గంగరాజు, నాయకులతో కలిసి మంగళవారం గ్రామానికి వెళ్లి సమావేశమయ్యారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చారు. వైస్ సర్పంచ్ అర్జున్, సీపీఎం నాయకులు నాగులు, టీడీపీ యువ నాయకులు రంజిత్, సందీప్, గుండు, తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన కొండచరియలు తొలగింపు


దిగువశోభ-ఎగువశోభ మార్గంలో కొండచరియలు తొలగిస్తున్న దృశ్యం

అనంతగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దిగువశోభ-ఎగువశోభ మార్గంలో అడ్డంగా పడిన కొండచరియలు తొలగింపుపనులను మంగళవారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడి బీర్జిగూడ, నరసపాడేర్, పోర్లపాడేర్, పూలుగూడ, దిగువశోభ, ఎగువశోభ గ్రామాలకు గత వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి షేక్ మౌళి దగ్గరుండి మంగళవారం రహదారికి అడ్డంగా ఉన్న కొండచరియలను తొలగించారు. రాకపోకలు పునరుద్ధరించడంతో ఆ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేశారు.


టీడీపీ నేత మృతికి సంతాపం

చింతపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో టీడీపీ నేత బేతా నూకరత్నం మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం గుండెపోటుతో నూకరత్నం మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఆమె పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, ఎంపీటీసీలు జయలక్ష్మి, ధారలక్ష్మి, టీడీపీ నేత రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, కోఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం

చింతపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలలోని తమ్మంగుల పంచాయతీ వెదురుపల్లి, చిట్టంగరువు ఆదివాసీలు శ్రమదానంతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. వెదురుపల్లి, చిట్టంగరువు మధ్యలో కేవలం కాలిబాట మాత్రమే ఉంది. దీంతో గ్రామానికి అంబులెన్సులు, ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. తాజాగా పక్కా గృహాల నిర్మాణానికి సామగ్రిని తరలించే వీలుకాకుండా ఉంది. దీంతో ఈ రెండు గ్రామాల గిరిజనులు సోమ, మంగళవారం శ్రమించి ఐదు కిలోమీటర్ల రహదారిని నిర్మించుకున్నారు. బీటీ రోడ్డు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి అధికారులను కోరారు.

7 నుంచి రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు


క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పాడేరు, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): పాడేరులో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర స్థాయి అండర్- 14, 17, 19 విలు విద్య(ఆర్చరీ) క్రీడా పోటీలను ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ దినేశ్ కుమార్ తెలిపారు. ఈ పోటీలకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూ నియర్ కళాశాల మైదానాలు వేదిక కానున్నాయన్నారు. మంగళవారం ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 936 మంది బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి. బ్రహ్మాజీరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.సూరిబాబు, మాజీ కార్యదర్శి వి. కొండబాబు,ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.భూపతిరాజు, పీఈటీ, పీడీ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు చెక్

- నేడు చౌడువాడ, కింతలిల్లో సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఫలించిన ఎమ్మెల్యే బండారు కృషి

మాడుగుల రూరల్/కె.కోటపాడు,నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజి సమస్య తీరనుంది. కె.కోటపాడు మండలంలోని చౌడువాడలో ఒక ఉపకేంద్రం, మాడుగుల మండలం కింతలిలో మరో ఉప కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ రెండు ఉప కేంద్రాలను బుధవారం విద్యుత్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. వీటి ఏర్పాటుతో చౌడువాడ, గరుగుగబిల్లి, మల్లంపాలెం, పైడమ్మపేట, పాచిలవానిపాలెం, గుల్లేపల్లి, చోడవరం మండలం రాయపురాజుపేట, సీమనాపల్లి, నరసాపురం, మాడుగుల మండలం కింతలి, కింతలి వల్లాపురం, పొంగలిపాక, జాలంపల్లి, అవురువాడ గ్రామ పంచాయతీల్లో విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. మాడుగుల, కె.కోటపాడు మండలాల్లోని టీడీపీ నాయకులు విద్యుత్ సమస్యలపై పదేపదే మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వద్ద ప్రస్తావించారు. దీంతో ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులతో చర్చించారు. దీంతో చౌడువాడలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.3.7 కోట్లు, కింతలిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.3. 31కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో యుద్ధప్రాతిపదిక పనులు చేయించారు. ఈ సబ్‌స్టేషన్ల ప్రారంభానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, టీడీపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు హాజరుకానున్నారు.



చౌడువాడ విద్యుత్ ఉప కేంద్రం

మత్తు పదార్థాలను నిషేధించాలి : పీడీఎస్‌వో

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రభుత్వం నిషేధం విధించాలని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య (పీడీఎస్‌వో) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌వో ఆధ్వర్యంలో మత్తు వదులుదాం, మంచి సమాజం కోసం పోరాడుదాం అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, సమాజంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన మద్యం, డ్రగ్స్ మహమ్మారి బారినపడి విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీటికి అడ్డుకట్ట వేయకపోతే సమాజంలో మరిన్ని నేరాలు ఘోరాలు పెరిగిపోతాయని, ఇది దేశ నాశనానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫాం, ఓటీటీల్లో వస్తున్న సినిమాల్లో విచ్చలవిడిగా పెరిగిపోయిన అశ్లీలానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో డాక్టర్ శకుంతలరావు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించి, వాటికి దూరంగా ఉండడం మంచిదని సూచించారు. సదస్సులో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర నాయకులు కె. గౌరీశంకర్, స్త్రీ విముక్తి సంఘటన్ రాష్ట్ర కార్యదర్శి ఓవీఎస్ లక్ష్మీకుమారి తదితరులు మాట్లాడారు. అంతకుముందు మత్తు వదులుతాం, మంచి సమాజం కోసం పోరాడుతాం అని నినాదాలు చేస్తూ స్థానిక వినాయకుని ఆలయం నుంచి పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో మానవ హారం నిర్వహించి మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో పీడీఎస్‌వో నాయకులు నందారపు భాస్కర్, వరహాలనాయుడు, వరుణ్, తరుణ్, నవయువ సమాఖ్య నాయకులు పి. రమేష్, రాజు, శివశంకర్, స్థానిక కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహిస్తున్న కాలేజీ విద్యార్థులు



నేడు చోడవరంలో మెగా జాబ్‌మేళా

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. అనేక కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్‌మేళాలో ఐటీఐ నుంచి ఇంటర్, డిగ్రీ ఇతర విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, జాబ్‌మేళాలో స్థానిక యువకులు పాల్గొనేలా కూటమి నాయకులు సహకారం అందించాలని ఎమ్మెల్యే రాజు కోరారు.

7న మండల సమావేశం

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మహేష్ తెలిపారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాలికల హైస్కూల్‌లో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ వేగి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంచే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలను ఎంఈవో కె.సింహాచలం ప్రారంభించారు. ఈ పోటీలలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలకు స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు పసుమర్తి సాంబమూర్తి, గనిరెడ్డి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఐవీ రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మోహనరావుపై విచారణ

రెండేళ్లలో ఒక్కసారే పని ప్రదేశానికి వచ్చారని వెల్లడి

జిల్లా అధికారులకు పూర్తిస్థాయి నివేదిక : ఏపీడీ శ్రీనివాసరావు

చీడికాడ, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులలోకి చేరిన మోహనరావు రెండేళ్లలో ఒక్క రోజు పని ప్రదేశానికి వచ్చాడని ఉపాధి మేట్లు, వేతనదారులు వెల్లడించారని ఆ పథకం ఏపీడీ బండారు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులైన గండి ఈశ్వరరావు, సుంకర కొండలరావు, మోసూరి కృష్ణ, గంజి శ్రీను, జె.జగ్గారావు, బొడ్డు కొండబాబు టెక్నికల్ అసిస్టెంట్ గా విధులలోకి చేరిన మోహనరావు రెండేళ్లలో ఒక్కసారి మాత్రమే పని ప్రదేశానికి వచ్చాడని కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఖండివరం గ్రామ సచివాలయంలో ఏపీడీ శ్రీనివాసరావు విచారణ నిర్వహించారు. ఈ విచారణకు హాజరైన ఎనిమిది మంది మేట్లు చెప్పిన విషయాలను రికార్డులో నమోదు చేశామని ఏపీడీ వెల్లడించారు. అయితే ఈ విషయం మా సమక్షంలో విలేకర్లకు వెల్లడించాలని మేట్లు , వేతనదారులు కోరారు. దీంతో అందరి సమక్షంలో విచారణ విషయాలను విలేకర్లకు ఆయన తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ పనితీరుపై జిల్లా అధికారులకు నివేదిస్తామని ఏపీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ విచారణలో ఈసీ సతీశ్, ఏపీవో అల్లు గంగునాయుడు, పండ్లతోటల పెంపకం టెక్నికల్ సూపర్‌వైజర్ కె. శ్రీనివాసరావు, మోహనరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ సూర్యనారాయణ, గంజి బాలాజీ, మాజీ ఎంపీపీకుచ్చు కళావతి. సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మేట్లను విచారిస్తున్న ఉపాధి హామీ ఏపీడీ శ్రీనివాసరావు



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో పారిశుధ్య పనులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ ఆధ్వర్యంలో చేపట్టారు. జంక్షన్ నుంచి మాడుగుల వెళ్లే వైపు మురుగు కాలువల్లో పూడిక తీయించడంతో పాటు రోడ్డు పక్కన చెత్తా చెదారాన్ని తొలగించారు. ఇళ్లలో వాడిన నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయరాదని స్థానికులకు సూచించారు. ఈ పనులను ఎంపీడీవో అప్పారావు పరిశీలించారు.

స్వచ్ఛభారత్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కె.కోటపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యన్న జూనియర్, డిగ్రీ కాలేజి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో మంగళవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా తుప్పలను తొలగించారు. కూరగాయలు, పండ్లు, పూలమొక్కల వద్ద శ్రమదానంతో గార్డెనింగ్ చేశారు. గేటు నుంచి షెడ్డు వరకు సిమెంట్ ఇటుకలతో దారి నిర్మించారు. ఇదిలా ఉండగా జోగన్నపాలెంలో జూనియర్ కాలేజి ఎన్ఎస్ఎస్ పీవో గాడి అప్పారావు ఆధ్వర్యంలో జూనియర్ కాలేజి వలంటీర్లు ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కన్నూరు సూర్యనారాయణ ప్రారంభించారు. అధ్యాపకులు సుశీల, దుర్గాదేవి, కల్యాణి, దీప్తి పాల్గొన్నారు.

'వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండండి'

దేవరాపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కె.చంద్రశేఖరు దేవ్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశవర్కర్లు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే రక్షిత నీటి పథకాలను క్లోరినేషన్ చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి పూజితా మేఘన పాల్గొన్నారు.

'పేదల ఆపద్బాంధువు పీఎం జీవన జ్యోతి'

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం ఆపద్బాంధువు వంటిదని స్టేట్ బ్యాంకు రావికమతం బ్రాంచ్ మేనేజర్ సిరి తెలిపారు. ఇటీవల మరణించిన కోరుకొండ గణేష్‌కు మంజూరైన రెండు లక్షల బీమా చెక్కును మంగళవారం అతని కుమారుడు సూరిబాబుకు మేనేజర్ సిరి అందజేశారు. ఈ పథకంలో రూ.436తో జాయిన్ అయిన వారు అర్హులన్నారు.

వాలీబాల్ సెలక్షన్స్

కె.కోటపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఏపీ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 బాల బాలికల వాలీబాల్ సెలక్షన్స్ జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కేఎం నాయుడు సమక్షంలో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 60 మంది బాలికలు, 60 మంది బాలురు హాజరుకాగా. అందులో 12 మంది బాలికలు, 12 మంది బాలురను ఎంపిక చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు బొడ్డు కృష్ణ, స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ జామి ఉమాదేవి పాల్గొన్నారు.

ఉచితంగా జీడిమామిడి మొక్కలు పంపిణీ

రోలుగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుచ్చెంపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా జీడిమామిడి మొక్కలను మంగళవారం పంపిణీచేశారు. మండల వీర మహిళా అధ్యక్షురాలు అనిమిరెడ్డి మహేశ్వరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలి బాలరాజుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన పోటీలు

చోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలలో భాగంగా నియోజకవర్గ స్థాయి పోటీలు మంగళవారం స్థానిక కొత్తూరు జెడ్‌పీ బాలికల హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో కె.సింహాచలం ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో మండల స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో కె.సింహాచలం, హైస్కూల్ హెచ్ఎం. ఐవీ రామిరెడ్డి బహుమతులు అందించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు అమరావతిలో జరగనున్న నమూనా అసెంబ్లీ సమావేశంలో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. ఈ పోటీలలో నాలుగు మండలాల నుంచి 12మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో స్థానిక గౌరీపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొరసాల పూజిత అనే విద్యార్థిని విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు కేవీఎం నాయుడు, సరోజిని, చంద్రిక, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి కాశీపురం విద్యార్థిని ఎంపిక

దేవరాపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న అమరావతిలో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవాల్లో మాట్లాడడానికి కాశీపురం 8వ తరగతి విద్యార్థిని వెంకటసాయి మేఘన ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు సుజాత మంగళవారం తెలిపారు. మేకింగ్ ఇండియా, వికసిత్ ఆంధ్రప్రదేశ్, భారత రాజ్యాంగ ఆవశ్యకత, పౌరుల హక్కులు-బాధ్యతలు గురించి ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడి వెంకటసాయి మేఘన ఎంపికైందన్నారు. అమరావతిలో ఈనెల 26న జరిగే మాక్ అసెంబ్లీలో అధ్యక్ష.. అంటూ తన వాణిని వినిపించడానికి ఎంపికయిందన్నారు. గైడ్ టీచర్ కె.రాంబాబును పలువురు అభినందించారు.



వెంకటసాయి మేఘన

ఆలయాలలో భక్తుల రద్దీని నియంత్రించాలి

బుచ్చెయ్యపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆలయాలలో భక్తులు రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ ఎం. లక్ష్మి వీఆర్‌వోలతోను, ఎంపీడీవో శివప్రసాద్ పంచాయతీ కార్యదర్శులతోను వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆలయాల్లో భక్తుల రద్దీ నియంత్రించాలని సూచించారు.







చెకుముకి పోటీలకు 200 మంది విద్యార్థులు హాజరు



చెకుముకి పోటీల ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మాడుగుల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్‌లో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కరస్పాండెంట్ తాళ్లపురెడ్డి నాగచంద్ర పర్యవేక్షణలో మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక సర్పంచ్ యడ్ల కళావతి, ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య పెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనాద శ్రీనివాసరావు ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో మాడుగుల, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 200 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గౌరీపట్టపు మహేష్ కుమార్, జాగాని ఈశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రశాంతి, చింతాడ సత్య, వరలక్ష్మి పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జిల్లాపరిషత్ బాలుర పాఠశాల హెచ్ఎం ముత్యాలనాయుడు భోజన సదుపాయాన్ని కల్పించారు.





కూటమి పాలనలోనే
కొప్పల వెలమల అభివృద్ధి

» కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్



విజయవాడ బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్

అనకాపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే కొప్పల వెలమల అభివృద్ధి జరుగుతున్నదని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ అన్నారు. విజయవాడ బీసీ భవన్‌లో మంగళవారం రాష్ట్ర మంత్రి ఎస్.సవిత ఆధ్వర్యంలో ఆదరణ-3 అమలుపై కొప్పల వెలమ కార్పొరేషన్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పీవీజీ కుమార్ మాట్లాడుతూ, ఆదరణ-3 అమలుకు ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించడం గొప్ప విషయమని అన్నారు. కొప్పల వెలమ విద్యార్థులకు విదేశీ విద్యా పథకాన్ని అమలు చేయాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో సామాజిక భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.

9, 10 తేదీల్లో ఎంఎస్ఎంఈ ఎగుమతుల సదస్సు

» సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు

అనకాపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విశాఖపట్నంలోని మారియట్ హోటల్‌లో జరగనున్న ఏపీ ఎంఎస్ఎంఈ ఎగుమతుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ వస్తువులు, డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్ అండ్ అప్పరెల్, ఆటోమొబైల్స్, ఆటో కాంపోనెంట్స్, ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్, కెమికల్స్ తదితర రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. జపాన్, శ్రీలంక, రష్యా న్యూజిలాండ్, జింబాబ్వే ఉగాండా, హంగేరి, కోస్టారికా తదితర దేశాల నుంచి వస్తువుల కొనుగోలుదారులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తమ ఉత్పత్తులను ప్రదర్శించి విదేశీ మార్కెట్‌కు విస్తరించుకోవాలని ఆమె కోరారు.

వైసీపీకి 'కోటవురట్ల' అధ్యక్షుడు గుడ్‌బై

» పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా


కిల్లాడ శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను అధినేత జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌కు పంపారు. కిల్లాడ కుటుంబం రాజకీయంగా 'తంగేడు రాజు'ల బాటలో నడుస్తున్నది. ఈ కుటుంబానికి చెందిన వారు గతంలో ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు చేపట్టారు. అయితే కొంతకాలం క్రితం తంగేడు రాజులకు, కిల్లాడ కుటుంబానికి మధ్య పొరపొచ్చాలు వచ్చాయనే ప్రచారం సాగుతున్నది. అయితే వ్యక్తిగత కారణాలతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్టు పార్టీ అధిష్ఠానానికి పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి జిల్లా పర్యటన

... 5వ పేజీ తరువాయి

ప్రారంభిస్తారు. సాయంత్రం విశాఖపట్నం వెళతారు.

మూడు నెలల్లో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణం!

కె.కోటపాడు, మాడుగుల మండలాల్లోని పలు గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య చాలా కాలం నుంచి వుంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయించారు. చౌడువాడలో రూ.3.7 కోట్లతో, కింతలిలో రూ.3.31 కోట్లతో ఈ ఏడాది ఆగస్టులో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చేపట్టి అక్టోబరు చివరినాటికి పూర్తి చేశారు. చౌడువాడ సబ్‌స్టేషన్‌తో చౌడువాడ, గరుగుగబిల్లి, మల్లంపాలెం, పైడమ్మపేట, పాచిలవానిపాలెం, గుల్లేపల్లి; కింతలి సబ్‌స్టేషన్‌తో కింతలి, కింతలి వల్లాపురం, పొంగలిపాక, జాలంపల్లి, అవురువాడ పంచాయతీల్లో విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య తీరుతుంది.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

... 5వ పేజీ తరువాయి

చూడాలని, అందుకు వసతిగృహ అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా వుండాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, తుప్పలు వుంటే తొలగించాలని, కుక్కలు లోనికి రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతిగృహం నుంచి పాఠశాలకు విద్యార్థుల రాకపై రోజూ సంబంధిత ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, విద్యార్థులపై నిత్య పర్యవేక్షణ వుండాలని స్పష్టం చేశారు. బాలికల వసతిగృహాల్లోకి సిబ్బంది తప్ప ఇతరులను అనుమతించవద్దన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఇటీవల సంభవించిన తుఫాన్‌కు భవనాలు దెబ్బతింటే వెంటనే బాగు చేయించాలని తెలిపారు. సమావేశానికి డీఈవో జి.అప్పారావునాయుడు, బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి బి.రామనాథం, తదితరులు హాజరయ్యారు.

వర్షాలతో రైతుల్లో గుబులు

... 5వ పేజీ తరువాయి

పగలు చాలా మండలాల్లో ఆకాశం మేఘావృతమై వుంది.

'మొంథా'తో 1,381 హెక్టార్లలో వరికి నష్టం

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో 1,381 హెక్టార్లలో వరి పంట నీట మునిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అనకాపల్లి మండలంలో అత్యధికంగా 570 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. బుచ్చెయ్యపేటలో 93, చోడవరంలో 84, సబ్బవరంలో 54, కశింకోటలో 65, మునగపాకలో 79, దేవరాపల్లిలో 24, కె.కోటపాడులో 49, చీడికాడలో 8, గొలుగొండలో 14, నర్సీపట్నంలో 21, నాతవరంలో 10, అచ్యుతాపురంలో 4, మాడుగులలో 2, కోటవురట్లలో 2, రాంబిల్లిలో 78, పరవాడలో 6, రావికమతంలో 7 ఎలమంచిలిలో 35 హెక్టార్లలో వరి నీట మునిగింది. 64.2 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఇందులో బొప్పాయి 6 హెక్టార్లు, అరటి 9.6, కూరగాయలు 10.2 హెక్టార్లు వున్నాయి. కాగా భారీ వర్షాల కారణంగా ఆర్అండ్‌బీ శాఖకు చెందిన 366.92 కిలోమీటర్ల మేర రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 13 కల్వర్టులు ధ్వంసం అయ్యాయి.

ఘనంగా ఐక్యతా యాత్ర

» వల్లభ్‌భాయ్ పటేల్ చూపిన మార్గంలో యువత నడవాలని ఎంపీ రమేశ్ పిలుపు




ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో 'యూనిటీ మార్చ్ (ఐక్యతా యాత్ర)' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని శారదా నది వంతెన సమీపంలో ఎంపీ సీఎం రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు వేదికపై పటేల్, భరతమాత చిత్రపటాలకు ఎంపీతోపాటు కలెక్టర్ విజయకృష్ణన్, యూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ సీనియర్ నేత దాడి రత్నాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ రమేశ్ మాట్లాడుతూ, వల్లభ్‌భాయ్ పటేల్ చూపిన మార్గంలో యువతకు ముందుకు వెళుతూ, దేశ ఐక్యతకు పాటుపడాలని అన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, 'ఏక్ భారత్.. ఆత్మనిర్భర్ భారత్' నినాదం దేశ పౌరులందరినీ ఏకతాటిపైకి తెస్తుందన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలన్నారు. శారదా నది బ్రిడ్జి వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగా సుంకరమెట్ట జంక్షన్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, కూటమి నాయకులు సురేంద్రమోహన్, పలకా రవి, మళ్ల సురేంద్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పూజారి శైలజ, కాండ్రేగుల వెంకటరమణ, నాగబోయిన నాగేశ్వరరావు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞానం వృద్ధి

» రోజూ కొంతసేపైనా పుస్తక పఠనం చేయాలి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు


పుస్తక మహోత్సవంలోని ఒక స్టాల్‌లో పుస్తకాన్ని పరిశీలిస్తున్న అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదివితే విజ్ఞానం పెరుగుతుందని శాసనసభాపతి సీహెచ్.అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఖాళీ సమయాల్లో ప్రముఖుల రచనలు చదవాలని సూచించారు. ప్రస్తుత యువత సెల్‌ఫోన్‌లకు బందీలు కావడం బాధాకరమన్నారు. కవులు, సాహితీవేత్తలు రాసిన పుస్తకాలను నేటి తరం తప్పక చదవాలని సూచించారు. తాను పుస్తక ప్రియుడునని, రోజులో కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయిస్తానని పేర్కొన్నారు. పురాణాలు, ఇతిహాసాలు, చరిత్ర, సాహిత్యానికి పుస్తకాలను ప్రతిఒక్కరూ చదవాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనకాపల్లిలో మొట్టమొదటిసారి పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అయ్యన్న వెంటన యూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర వున్నారు.

కార్తీక పౌర్ణమికి భద్రతా ఏర్పాట్లు

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్ని దేవాలయాలు, స్నానఘట్టాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, దేవదాయ, పోలీసు, వైద్య ఆరోగ్య, మండల పరిషత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆలయాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, మంచినీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించాలని సూచించారు. సముద్రం, నదీ తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేచోట గజఈతగాళ్లను అందుబాటులో వుంచాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తగిన మరుగు సదుపాయం కల్పించాలని చెప్పారు. ఇటీవల కాశీబుగ్గలో జరిగిన దుర్ఘటన దృష్ట్యా ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న ఆలయాల వివరాలను తహశీల్దార్లు, ఎండీవోలు తీసుకొని వారితో సమావేశం ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రాంబిల్లి మండలం పంచదార్ల, కశింకోట మండలం సత్యనారాయణస్వామి గిరిప్రదక్షిణలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, దేవదాయ శాఖ ఆధీనంలోని ఆలయాలకు సంబంధించి ఆ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం పోలీసు సిబ్బందిని నియమిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి సుబ్బలక్ష్మి, దేవదాయ శాఖ అధికారి సుధారాణి, ఆర్డీవోలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో ఎందుకిలా!?

... 5వ పేజీ తరువాయి

ఆందోళనకు దిగారు. దీనిని అప్పటి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణ్ సీరియస్‌గా తీసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. విద్యార్థుల ఆధ్వర్యంలో మెస్ కమిటీలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అలాగే, ఎప్పటికప్పుడు మెస్‌లను తనిఖీ చేసేలా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అయితే, మెస్ కమిటీల నిర్వహణ బాధ్యతలు తీసుకునేందుకు చాలామంది విద్యార్థులు ముందుకురాలేదు. కొద్దినెలలు గడిచిన తరువాత మరోసారి అదే విధమైన ఆరోపణలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీగా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన వచ్చిన తరువాత విద్యార్థుల ఆందోళనలు మరింత పెరిగాయి. భోజనం సరిగా లేదని ఒకసారి, భోజనంలో పురుగులు, జెర్రిలు ఉంటున్నాయని మరోసారి విద్యార్థులు నిరసన తెలియజేశారు. క్యాంపస్‌లోని ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలంటూ ఒకసారి ఆందోళన చేపట్టారు. ఆ తరువాత వసతి గృహాల్లో అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారంటూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థినులు ఆందోళన చేశారు. కొద్దిరోజుల కిందట హాస్టల్ విద్యార్థి ఒకరు గుండెపోటుతో చనిపోయారు. ఈ నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి చనిపోయాడంటూ పదుల సంఖ్యలో విద్యార్థులు వీసీ కార్యాలయంలోకి వెళ్లి గొడవ చేశారు. వర్సిటీలో ఐఐఎంకు కేటాయించిన భవనాన్ని ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగానికి కేటాయించాలని కోరుతూ మంగళవారం పలువురు విద్యార్థులు వీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

అప్పుడు మౌనమేలా.?

గతంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులను కలిసేందుకు కూడా అవకాశం ఉండేది కాదు. వీసీ కార్యాలయం ఎదుట ఇనుప కంచెలు (గ్రిల్స్) ఉండేవి. అప్పుడు ఏ విద్యార్థి సంఘం కనీసం ప్రశ్నించే ప్రయత్నం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శశిభూషణ్ ఇన్‌చార్జి వీసీగా ఉన్న సమయంలో ఆ ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు. ఇక ఆరోగ్య కేంద్రం అత్యంత దారుణ స్థితికి చేరుకోవడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణం. అయితే గత ప్రభుత్వ హయాంలో ఎవరూ ప్రశ్నించే సాహసం చేయలేకపోయారు. కానీ, ఇప్పుడు ఏదో ఒక సమస్యపై ఆందోళనలకు దిగుతుండడం క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. క్యాంపస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలనే వాదన వినిపిస్తోంది.

జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు

... 5వ పేజీ తరువాయి



నర్సీపట్నంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

దరఖాస్తుదారుడు భరించాలి. జర్మనీలో ఉద్యోగంలో చేరిన మూడు నెలల తర్వాత ఈ సొమ్మును తిరిగి చెల్లిస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత వీసా, విమానం ఖర్చులను జర్మనీ కంపెనీ భరిస్తుంది. నెలకు జీతం 2,600 నుంచి 3,000 యూరోలు (సుమారు రూ.3 లక్షలు) ఇస్తారు. దరఖాస్తుదారుని వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాలి. కంపెనీతో చేసుకున్న ఒప్పందం మేరకు రెండేళ్లు అక్కడ పనియాల్సి ఉంది.

ఐటీఐ పూర్తి చేసిన వారికి రాజమహేంద్రవరంలో జర్మనీ భాష, వృత్తి పరంగా రోజుకు ఎనిమిది గంటల చొప్పున 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ ఇస్తారు. ట్రైనింగ్ సమయంలో వసతి, భోజనం సదుపాయాలను ఏపీఎస్ఎస్‌డీసీ కల్పిస్తుంది. ట్రైనింగ్ ఫీజు రూ.1.15 లక్షలు దరఖాస్తుదారుడు చెల్లించాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం జర్మనీ వెళ్లడానికి వీసా, విమానం ఖర్చులను కూడా దరఖాస్తుదారుడే భరించాలి. జర్మనీలో ఉద్యోగంలో చేరిన తరువాత ఆరు నెలలపాటు ప్రొబేషన్ కాలం. ఈ సమయంలో 1,000 యూరోలు ఇస్తారు. తరువాత జీతం నెలకు 2,600 నుంచి 2,700 యూరోలు చెల్లిస్తారు. కంపెనీ ఒప్పందం మేరకు కనిష్ఠంగా రెండేళ్లు అక్కడ పని చేయాల్సి వుంటుంది.

వ్యవసాయ కూలీల వలస

... 5వ పేజీ తరువాయి

అక్కా చెరువుల్లో పనులు చేస్తే ఎక్కువ కూలి లభిస్తుందని వలస


మట్టవాని పాలెం నుంచి వ్యాన్‌లో వలస పోతున్న కూలీలు

కూలీలు చెబుతున్నారు. కాగా వ్యవసాయ కూలీలకు స్థానికంగా ఉపాధి పనులు ఎందుకు కల్పించడం లేదని ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. ఇటీవల కురిసిన తుఫాన్ వర్షాలతో చెరువులన్నీ నిండాయని, జీడిమామిడి తోటల్లో ట్రెంచ్ కటింగ్, పంట కుంటల తవ్వకం పనులు చేపట్టాల్సి వుందని, అయితే అధిక వర్షాల కారణంగా పనులు ప్రారంభించలేదని చెప్పారు.

వరికి చీడపీడలు

... 5వ పేజీ తరువాయి

లేదా కార్బండిజమ్ కలిపి పిచికారీ చేయాలని ఏడీఆర్ సూచించారు. తెల్లదోమ ఆశిస్తే లీటరు నీటికి డైమిథోయేట్ 1.7 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కంది పంటను ఆకుచుట్టు పురుగు ఆశిస్తే.. లీటరు నీటికి 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

టమాటా, బెండ, చిక్కుడు వంటి కూరగాయ పంటలను ఆకుమచ్చ తెగులు ఆశిస్తే.. లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బొప్పాయిలో కాండం మొదలు కుళ్లు నివారణకు మాంకోజెట్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున చెట్ల కాండాన్ని బాగా తడపాలని ఆయన సూచించారు. రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడతాయని చెప్పారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గిరి, ఆర్.సరిత, సిహెచ్.రామలక్ష్మి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



బస్సు ముందు భాగంలో ఇరుక్కున్న బైక్, రోడ్డుపై పెదరాయుడు మృతదేహం. దిగువవన పెదరాయుడు (ఫైల్ ఫొటో)

నాతవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని కృష్ణాపురం సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సరుగుడు పంచాయతీ శివారు అచ్చెంపేట గ్రామానికి చెందిన కోసూరు పెదరాయుడు (20) కాకినాడ జిల్లాలో కూలి పనులకు వెళుతుంటాడు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా కోటనందూరు వెళ్లి మంగళవారం బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. కృష్ణాపురం సమీపంలోని అచ్చెంపేట- పోతురాజుబాబు వనం మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్ పరస్పరం ఢీకొన్నాయి. దీంతో పెదరాయుడు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పెదరాయుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

ఏలేరు కాలువలో యువకుడి మృతదేహం

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొప్పాక వద్ద ఏలేరు కాలువలో యువకుడి మృతదేహం లభ్యమైందని రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. గాజువాక ప్రాంతంలోని చినగంట్యాడకు చెందిన పల్లి దిలీప్‌కుమార్ (32) ఈ నెల 2వ తేదీ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో అనకాపల్లి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరాడు. అదే రోజు రాత్రిగానీ, సోమవారంగానీ ఇంటికి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కొప్పాక సమీపంలో ఏలేరు కాలువ వద్ద దిలీప్‌కుమార్‌కు చెందిన బైక్ కనిపించడంతో దగ్గర బంధువైన గొన్న శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ తండ్రి పల్లి అప్పలకొండకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఇక్కడకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 300 మీటర్ల దూరంలో ఏలేరు కాలువలో దిలీప్‌కుమార్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన లారీ


దాసరయ్యపాలెం వద్ద రోడ్డు మధ్యలో కూరుకుపోయిన లారీ

రావికమతం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఈసీ రోడ్డులో దాసరయ్యపాలెం వినాయక గుడి సమీపంలో బండరాళ్ల లోడుతో వస్తున్న లారీ మంగళవారం కూరుకుపోయింది. దీంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ రోడ్డు పొడవునా గోతులు ఉండడంతో వర్షపు నీరు చేరింది. గొంపమెట్ట నుంచి బండరాళ్ల లోడుతో వస్తున్న లారీ దాసరయ్యపాలెం వద్ద రోడ్డు మధ్యలో కూరుకుపోవడంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీశారు.

రైలులో ప్రసవం

» మగబిడ్డకు జన్మనిచ్చిన ఝార్ఖండ్ మహిళ

అనకాపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం ఝార్ఖండ్ మహిళ ప్రసవించింది. ఝార్ఖండ్‌కు చెందిన సునిక చాటర్ నిండు గర్భిణి. భర్త కండే హస్నాతో కలిసి ఆమె అనంతపురం జిల్లా గుత్తి నుంచి భువనేశ్వర్‌కు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. రైలు అనకాపల్లి సమీపంలోకి వచ్చేసరికి ఆమె ప్రయాణిస్తున్న ఎస్-4 బోగీలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలియగానే ఆర్‌పీఎఫ్ సిబ్బంది 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. రైలు అనకాపల్లి మూడో నంబరు ప్లాట్‌ఫారానికి వచ్చిన వెంటనే స్టేషన్ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్‌పీఎఫ్ అధికారులు తల్లీబిడ్డను దించి, 108లో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

టెట్ నుంచి టీచర్లను మినహాయించాలి

» డీఈవోకు ఫ్యాప్టో ప్రతినిధులు వినతి


డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

అనకాపల్లి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'టెట్' నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఫ్యాప్టో నాయకులు మంగళవారం కొప్పాకలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడును కలిసి కోరారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు మాట్లాడుతూ, 25-30 సంవత్సరాల నుంచి బోధనలో ఉన్న ఉపాధ్యాయులు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం టెట్ రాయాలని విద్యా శాఖ అధికారులు చెప్పడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి చట్టపరమైన మార్పులు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం అందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574